‘రాజ్య సంస్కరణ’ ఈ–పేపర్ కోసం ఇక్కడ స్కాన్ చేయండి..

# రాజ్య సంస్కరణ

TGBIL/26/A6717 RAJYA SAMSKARANA తెలుగు దినపత్రిక

www.rajyasamskarana.com

‘రాజ్య సంస్కరణ’ ఈ–పేపర్ కోసం ఇక్కడ స్కాన్ చేయండి..

మేడ్చల్ మల్కాజిగిరి | సంపుటి : 1 | సంచిక : 46 | బుధవారం | 30.9.2026 | పేజీలు : 8 | వెల రూ. 2

Medchal Malkajgiri | Volume: 1 | Issue: 46 | Wednesday | 30.9.2026 | Pages: 8 | Rate: 2





## కమలాన్ని కాదంటే కాంగ్రెస్‌దే హవా..!

• మోడీ అంగీకరించారన్న రాహుల్ • కొత్త కాంట్రవర్సీతో బీజేపీకి ట్రబుల్

ఢిల్లీలో ఒక్క మాట ఇప్పుడు దేశ రాజకీయాల్లో ప్రకంపనలు రేపుతోంది. “మేం వెళ్లిపోయాక మీరు వస్తారు” అని మోదీ తనతో అన్నారని రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్య కేవలం రాజకీయ సభలో వినిపించిన మాటేనా? లేక రాబోయే రాజకీయ సమీకరణాలకు సంకేతమా? బీజేపీని ఓడించగల శక్తి కాంగ్రెస్‌కే ఉందని రాహుల్ బలంగా చెబుతున్న వేళ.. మరోవైపు ఉత్తరాదిలో బీజేపీ పట్టు ఇంకా గట్టిగానే ఉంది. దక్షిణాదిలో కాంగ్రెస్ బలపడుతున్నా.. ఢిల్లీ పీఠానికి దారి మాత్రం ఉత్తరాది రాష్ట్రాల మీదుగానే సాగాలి. ఇదే కాంగ్రెస్‌కు అసలు పరీక్ష. దీనికి తోడు ఓటర్ల జాబితా, ఎస్ఐఆర్, ఎన్నికల కమిషన్ వ్యవహారంపై కాంగ్రెస్ పోరాటాన్ని మరింత తీవ్రం చేసింది. ప్రధాన ఎన్నికల కమిషనర్ రాజీనామా నుంచి ప్రధాని రాజీనామా డిమాండ్ వరకు సీడబ్ల్యూసీ తీసుకున్న నిర్ణయాలు రాజకీయ వేడిని పెంచాయి. ఇక మమతా బెనర్జీ నేతృత్వంలోని టీఎంసీ సహా ప్రాంతీయ పార్టీల భవిష్యత్ పాత్ర ఏంటి? కాంగ్రెస్‌తో అవి కలిసి నడుస్తాయా? లేక తమ దారినే ఎంచుకుంటాయా? **2029**కు ముందే దేశ రాజకీయాల్లో కొత్త ధ్రువీకరణకు తెరలేస్తోందా? రాహుల్ వ్యాఖ్యల వెనుక దాగి ఉన్న అసలు రాజకీయ వ్యూహమేంటి?



## యువత వీధుల్లోకి రావాలి

• మహిళల భద్రతపై రాహుల్ గాంధీ పిలుపు

కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ మహిళలపై వేధింపులు, అత్యాచారాలకు వ్యతిరేకంగా యువత పెద్ద ఎత్తున నిరసనలకు రావాలని పిలుపునిచ్చారు. మంగళవారం విడుదల చేసిన వీడియో సందేశంలో మహిళలను ఇళ్లకే పరిమితం చేయడం పరిష్కారం కాదని స్పష్టం చేశారు. దేశవ్యాప్తంగా మహిళలు రోడ్లపై నడవాలంటే భయపడుతున్నారని, వేధింపులు, అత్యాచారాల భయంతో జీవిస్తున్నారని అన్నారు. (వివరాలు 3లో..)



## సీఈసీ రాజీనామా చేయాల్సిందే

కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ తీర్మానం

సీఈసీ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ డిమాండ్ చేస్తూ కీలక తీర్మానం చేసింది. మల్లికార్జున్ ఖర్గే అధ్యక్షతన సుమారు రెండున్నర గంటలపాటు జరిగిన సమావేశంలో ఎన్నికల జాబితా సవరణ, సర్ వ్యవహారంపై పార్టీ తదుపరి కార్యాచరణను చర్చించారు. (వివరాలు 3లో..)

## సుప్రీంకోర్టులో పిటిషన్

వచ్చే వారం విచారణకు అంగీకారం

ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌ను పదవి నుంచి తాత్కాలికంగా సస్పెండ్ చేయాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌పై సుప్రీంకోర్టు కీలక నిర్ణయం తీసుకుంది. పిటిషన్‌ను వచ్చే వారం విచారణకు లిస్ట్ చేసేందుకు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ అంగీకరించారు. పిటిషనర్ రాకేశ్ కుమార్ సింగ్ తరఫున సీనియర్ న్యాయవాది వికాస్ సింగ్, న్యాయవాదులు సుదీప్ చంద్ర, ముదిత్ గుప్తా ముందస్తు విచారణ కోరుతూ మౌఖికంగా ప్రస్తావించారు. తుది తీర్పు వెలువడే వరకు జ్ఞానేశ్ కుమార్ ప్రధాన ఎన్నికల కమిషనర్ విధులు నిర్వహించకుండా ఆదేశాలు ఇవ్వాలని పిటిషన్‌లో కోరారు. (వివరాలు 3లో..)



## తుమ్మిడిహట్టికి అనుమతుల వేగం

మహారాష్ట్రతో ఒప్పందానికి సీఎం పట్టు

తుమ్మిడిహట్టి బ్యారేజీ నిర్మాణానికి మహారాష్ట్ర నుంచి త్వరగా అనుమతులు ఇప్పించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కేంద్ర జల్ శక్తి మంత్రి సీఆర్ పాటిల్‌ను కోరారు. ఢిల్లీలో మంగళవారం సాయంత్రం జరిగిన సమావేశంలో రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డితో కలిసి సీఎం పలు కీలక అంశాలను కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. (వివరాలు 2లో..)

### నేడు సిరిసిల్లకు సీఎం

అభివృద్ధి పనులకు శ్రీకారం

కరీంనగర్‌లో కలెక్టరేట్ ప్రారంభం



## మోడీని ఎదుర్కోలేక ఆరోపణలు

ఈసీ, ఈవీఎంలపై విమర్శలు

కాంగ్రెస్‌పై బండి సంజయ్ ఫైర్

ప్రధాని నరేంద్ర మోదీని రాజకీయంగా ఎదుర్కొనే ధైర్యం లేకే కాంగ్రెస్ ఈసీ, ఈవీఎంలు, ఎస్ఐఆర్‌పై ఆరోపణలు చేస్తోందని కేంద్ర మంత్రి బండి సంజయ్ విమర్శించారు. ఎన్నికల్లో గెలిచే సత్తా లేక కాంగ్రెస్ నిరాధార ఆరోపణలు చేస్తోందని మండిపడ్డారు. (వివరాలు 2లో..)



## అందరి సంక్షేమమే అసలైన అభివృద్ధి

చివరి వ్యక్తి బాగుంటేనే దేశం బాగుంటుంది

తేల్చి చెప్పిన ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్

అభివృద్ధి అంటే కొందరి జీవితాలు మాత్రమే మెరుగుపడటం కాదని ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్ అన్నారు. మహారాష్ట్రలోని యవత్మాల్‌లో పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ జయంతి సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ సమాజంలోని చివరి వ్యక్తి సంక్షేమాన్ని అభివృద్ధికి కేంద్రంగా ఉంచాలని సూచించారు. (వివరాలు 2లో..)



## నాతో పెట్టుకోకు..!

అన్నకు సిస్టర్ స్వీట్ వార్నింగ్

పార్టీ నిర్ణయాలపై కవిత ప్రశ్నలు

తెలంగాణ రాజకీయాల్లో బీఆర్ఎస్ అంతర్గత వ్యవహారాలు మరోసారి హాట్‌టాపిక్‌గా మారాయి. తెలంగాణ రాష్ట్ర సేన అధ్యక్షురాలు కవిత తాజాగా చేసిన వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో చర్చకు దారితీశాయి. పార్టీ నేతలపై తీవ్ర విమర్శలు చేసిన ఆమె, తనను పార్టీ నుంచి సస్పెండ్ చేసిన సందర్భాన్ని ప్రస్తావిస్తూ పలు ప్రశ్నలు సంధించారు. (వివరాలు 2లో..)

## ఆడోళ్లతోనే కొట్టిస్తా..

ప్రత్యర్థులకు కొండంత వార్నింగ్

తెలంగాణ రాజకీయాల్లో కొంతకాలంగా మౌనంగా ఉన్న మాజీ మంత్రి, వరంగల్ తూర్పు ఎమ్మెల్యే కొండా సురేఖ మరోసారి రాజకీయంగా యాక్టివ్ అయ్యారు. సీఎం రేవంత్‌రెడ్డి వర్సెస్ కొండా సుస్మిత వ్యవహారంతో తలెత్తిన వివాదాల నేపథ్యంలో ఆమె మంత్రివర్గం నుంచి బర్తరఫ్ అయిన తర్వాత కొంతకాలం రాజకీయంగా సైలెంట్‌గా ఉన్నారు. తాజాగా వరంగల్ జిల్లా రాజకీయాల్లో మళ్లీ చురుకుగా వ్యవహరిస్తూ ప్రత్యర్థులపై తీవ్ర వ్యాఖ్యలు చేశారు.






### మహిళా ఎమ్మెల్యేలపై దురుసు వైఖరి

పోలీసులపై విచారణకు హైకోర్టు ఆదేశం




### అగ్నివీరులకు మధ్యప్రదేశ్ సర్కార్ భారీ కోటా

యూనిఫాం ఉద్యోగాల్లో 20 శాతం రిజర్వేషన్



## సింగరేణిపై సీఎంకు కేటీఆర్ లేఖ

కార్మికుల బకాయిలతో ఏడు డిమాండ్లు

సింగరేణి కార్మికుల సమస్యలు మరోసారి రాజకీయ వేడిని రాజేస్తున్నాయి. బకాయిలు, బోనస్, పెర్క్స్ పన్ను, వారసత్వ ఉద్యోగాలు, సొంతింటి పథకం.. ఇలా ఒక్కొక్క అంశాన్ని తెరపైకి తెస్తూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి రాసిన లేఖ ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. సంస్థకు లాభాలు వస్తున్నా కార్మికులకు అందాల్సిన వాటా విషయంలో అన్యాయం జరుగుతోందన్నది కేటీఆర్ ప్రధాన ఆరోపణ. 2023 నుంచి 2025 వరకు రూ.2,342 కోట్ల బోనస్ బకాయిలు ఉన్నాయని, రాష్ట్ర ప్రభుత్వం సింగరేణికి చెల్లించాల్సిన సుమారు రూ.60 వేల కోట్ల బకాయిలను విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు. అంతటితో ఆగకుండా మెడికల్ బోర్డుల కోసం ఎదురుచూస్తున్న 2,500 మందికి పైగా కార్మికుల సమస్యలు, మారు పేర్ల బాధితులు, డిస్మిస్ అయిన ఉద్యోగుల అంశాలను ప్రస్తావించారు. ఎన్నికల హామీగా పేర్కొన్న 250 గజాల స్థలం, రూ.20 లక్షల వడ్డీలేని రుణం ఇవ్వాలని కోరారు. మరోవైపు సింగరేణిలో ప్రభుత్వ వాటాల ఉపసంహరణ, ప్రైవేటీకరణ ప్రయత్నాలను విరమించుకోవాలని స్పష్టం చేశారు.

## ఆ ఓటర్లపై హస్తం వైఖరేంటి?

ఈసీపై కాంగ్రెస్‌కు బీజేపీ కౌంటర్



ఎన్నికల సంఘంపై కాంగ్రెస్ చేస్తున్న విమర్శలపై బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి స్మృతి ఇరానీ తీవ్రంగా స్పందించారు. ప్రస్తుత ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రజల మద్దతు పొందలేకపోతున్న కాంగ్రెస్ ఇప్పుడు ఎన్నికల వ్యవస్థను బలహీనపరిచే ప్రయత్నం చేస్తోందని ఆమె ఆరోపించారు. ఢిల్లీలోని బీజేపీ కార్యాలయంలో మంగళవారం మీడియాతో మాట్లాడిన ఇరానీ, ఎన్నికల సంఘంపై కాంగ్రెస్ దాడి చేయడం ప్రజాస్వామ్య సంస్థలపై నమ్మకాన్ని దెబ్బతీసే చర్యగా అభివర్ణించారు. (వివరాలు 3లో..)



## శివరామ సంవాదం..

## రాజుకున్న వివాదం

- జైశ్రీరామ కంటే శివనామం బెటర్
- బీజేపీకి రేవంత్ కౌంటర్
- కాక రేపిన కామెంట్.. కాషాయ దళం వైలెంట్

వివరాలు 6లో..

ఢిల్లీ వేదికగా రేవంత్ రెడ్డి మాటలు.. తెలంగాణ దాటి దేశ రాజకీయాల్లో కొత్త ప్రకంపనలు! రాముడు–శివుడు, ఉత్తరం–దక్షిణం, బీజేపీ రాజకీయాల చుట్టూ సీఎం చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు పెద్ద రాజకీయ చర్చకు దారితీశాయి. “జై శ్రీరామ్” ఎందుకు.. “హర హర మహాదేవ్” ఎందుకు కాదు? శివుడు పేదల దేవుడు.. రాముడు ధనికుల దేవుడు.. బీజేపీ ధనికుల పార్టీ అంటూ రేవంత్ చేసిన వ్యాఖ్యల వెనుక అసలు వ్యూహమేంటి? బీజేపీ రాముడిని రాజకీయంగా ఉపయోగించుకుంటోందని కాంగ్రెస్ వివరణ ఇస్తుంటే.. రాముడు–శివుడి మధ్య రాజకీయ గీతలు గీస్తున్నారంటూ బీజేపీ ఎదురుదాడికి దిగింది. అయితే ఇదంతా యాదృచ్ఛికమా? ఢిల్లీకి వెళ్లిన ప్రతిసారీ జాతీయ రాజకీయాలను కదిలించే అంశాలనే రేవంత్ ఎందుకు ఎంచుకుంటున్నారు? సర్ నుంచి ఉత్తర–దక్షిణ ప్రాతినిధ్యం వరకు.. ఇప్పుడు రాముడు–శివుడి రాజకీయ ప్రతీకల వరకు ఆయన మాటల్లో ఏదైనా పెద్ద వ్యూహం దాగి ఉందా? తెలంగాణ ముఖ్యమంత్రి పరిధి రాష్ట్రాన్ని దాటి ఢిల్లీ రాజకీయాల వైపు విస్తరిస్తోందా? “కొత్త వివాదం”గా కనిపిస్తున్న ఈ వ్యాఖ్యల వెనుక “కొత్త రాజకీయ లక్ష్యం” ఉందా? రేవంత్ మాటలపై బీజేపీ దాడి.. కాంగ్రెస్ ఎదురుదాడి.. ఈ మాటల యుద్ధం ఎక్కడికి దారితీయబోతోంది? అసలు టార్గెట్ ఎవరు.. లక్ష్యం ఏమిటి?




## ఉద్యోగాలు వద్దు.. కార్లు కొనండి.. డ్రైవర్లు కండి!

యువతకు యూపీ డిప్యూటీ సీఎం హితవు

ఉద్యోగం కోసం చదువుకున్నారా? పోటీ పరీక్షలు రాశారా? నోటిఫికేషన్ కోసం ఎదురుచూస్తున్నారా? అయితే ఆ టెన్షన్ అంతా ఎందుకు.. ఒక కారు కొనుక్కోండి.. ట్యాక్సీ నడపండి.. మీరే బాస్.. మీరే డ్రైవర్.. మీరే ఉద్యోగి.. అన్నట్టుగా ఉత్తరప్రదేశ్ డిప్యూటీ సీఎం బ్రజేశ్ పాఠక్ యువతకు ఇచ్చిన సలహా ఇప్పుడు వ్యంగ్యానికి వేదికగా మారింది.




## లెక్కలు రావడం లేదు ఏఐతో చిన్నారులకు తిప్పలు

ఐనా డోంట్ కేర్, బెంగపడొద్దు

ఎన్విడియా సీఈఓ రియాల్టీ చెక్

ఏఐ సాధనాలపై ఆధారపడటం వల్ల పిల్లలు ప్రాథమిక గణిత నైపుణ్యాలను మరిచిపోతున్నా పెద్దగా ఆందోళన అవసరం లేదని ఎన్విడియా సీఈఓ జెన్సన్ హువాంగ్ అభిప్రాయపడ్డారు. ది ఎజ్రా క్లెయిన్ షోలో మాట్లాడుతూ, ప్రస్తుతం పిల్లలు లాంగ్ డివిజన్, గుణకార పట్టికలు, స్క్వేర్ రూట్స్ వంటి ప్రాథమిక లెక్కలను మునుపటిలా సాధన చేయడం లేదన్నారు.




## రూ.3 వేల మందులు.. రూ.27 వేల బిల్లు!

క్యాన్సర్ మందుల ధరలపై సుప్రీం ఆగ్రహం

క్యాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధులకు వాడే మందుల ధరల్లో భారీ వ్యత్యాసంపై సుప్రీంకోర్టు తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. రిటైలర్‌కు సుమారు రూ.3 వేలకు అందే అత్యవసర క్యాన్సర్ మందు వినియోగదారుడికి ఏకంగా రూ.27 వేలకు అమ్మడం ఏంటని జస్టిస్ విక్రమ్ నాథ్, జస్టిస్ సందీప్ మెహతాతో కూడిన ధర్మాసనం ప్రశ్నించింది. దాదాపు పది రెట్ల ధర పెంపుపై స్పందిస్తూ, ఈ రూ.24 వేల వ్యత్యాసం ఎక్కడికి వెళ్తోందో చెప్పాలని ప్రశ్నించింది.

# తుమ్మిడిహట్టికి అనుమతుల వేగం

## మహారాష్ట్రతో ఒప్పందానికి సీఎం పట్టు

తుమ్మిడిహట్టి బ్యారేజీ నిర్మాణానికి మహారాష్ట్ర నుంచి త్వరగా అనుమతులు ఇప్పించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కేంద్ర జలశక్తి మంత్రి సీఆర్ పాటిల్‌ను కోరారు. ఢిల్లీలో మంగళవారం సాయంత్రం జరిగిన సమావేశంలో రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డితో కలిసి సీఎం పలు కీలక అంశాలను కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. మహారాష్ట్ర కోరిన సమాచారాన్ని ఇప్పటికే అందించామని తెలిపారు. ఎఫ్ఆర్ఎల్ +152 మీటర్ల స్థాయిలో బ్యారేజీ నిర్మాణానికి రెండు రాష్ట్రాల మధ్య త్వరగా అంగీకారం కుదరాలని కోరారు. ఈ స్థాయిలో నిర్మిస్తే ఎల్లంపల్లికి గ్రావిటీ ఆధారంగా నీటిని తరలించే అవకాశం ఉంటుందని, విద్యుత్ వినియోగం, వ్యయం తగ్గుతాయని వివరించారు.

### ప్రాజెక్టులకు పర్యావరణ అనుమతుల వేగం

పాలమూరురంగారెడ్డి ఎత్తిపోతల పథకం, డిండి ఎత్తిపోతల పథకం, సీతారామ సాగర్ బహుళార్థక ప్రాజెక్టు, గౌరవెల్లి రిజర్వాయర్లకు పర్యావరణ అనుమతులు త్వరగా మంజూరు చేయాలని సీఎం విజ్ఞప్తి చేశారు. సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో కేంద్రం పర్యావరణ అనుమతుల మార్గదర్శకాలు ప్రకటించనున్నందున, తెలంగాణ ప్రాజెక్టులకు వెంటనే అనుమతులు ఇవ్వాలని కోరారు. ఆలస్యంతో నిర్మాణ వ్యయం పెరుగుతోందని తెలిపారు. సమ్మక్కసాగర్ ప్రాజెక్టుకు సీడబ్ల్యూసీ వద్ద పెండింగ్‌లో ఉన్న అనుమతులు త్వరగా ఇవ్వాలని కోరారు. డీపీఆర్ సమర్పించామని, నీటిపారుదల ప్రణాళిక, అంతర్రాష్ట్ర అంశాలపై అనుమతులు కావాలని వివరించారు.

### టెలిమెట్రీ ఏర్పాటుపై ప్రత్యేక విజ్ఞప్తి

కృష్ణా జలాల వినియోగాన్ని పర్యవేక్షించేందుకు టెలిమెట్రీ యంత్రాల ఏర్పాటు వేగవంతం చేయాలని సీఎం కోరారు. మొదటి దశ ఏర్పాటుకు అవసరమైన రూ.4.15 కోట్లను తెలంగాణ ప్రభుత్వం ఇప్పటికే చెల్లించిందని గుర్తు చేశారు. మొదటి దశను త్వరగా పూర్తి చేయడంతో పాటు రెండో, మూడో



దశల యంత్రాల ఏర్పాటును కూడా వేగవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో మంత్రి జి. వివేక్ వెంకటస్వామి, ఎంపీ గడ్డం వంశీకృష్ణ, ఎమ్మెల్యే గడ్డం వినోద్, నీటిపారుదల సలహాదారు ఆదిత్యనాథ్ దాస్, సీఎం కార్యదర్శి మాణిక్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

# నేడు సిరిసిల్లకు సీఎం

- అభివృద్ధి పనులకు శ్రీకారం
- కరీంనగర్‌లో కలెక్టరేట్ ప్రారంభం



ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి ఇవాళ సిరిసిల్ల జిల్లాలో పర్యటించనున్నారు. పర్యటనలో భాగంగా మధ్యాహ్నం కరీంనగర్ జిల్లా కలెక్టరేట్ భవన సముదాయాన్ని ముఖ్యమంత్రి ప్రారంభించనున్నారు. అనంతరం వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేయనున్నారు. జిల్లా అభివృద్ధి, ప్రభుత్వ కార్యక్రమాల అమలుపై అధికారులతో సీఎం సమీక్ష నిర్వహించనున్నారు. పలు శాఖల పురోగతి, ప్రజలకు అందుతున్న సేవలపై అధికారుల నుంచి వివరాలు తీసుకోనున్నారు. కరీంనగర్ కార్యక్రమాలు పూర్తయ్యాక సాయంత్రం సిరిసిల్లకు ముఖ్యమంత్రి చేరుకోనున్నారు.

### ర్యాలీగా సభా ప్రాంగణానికి సీఎం

సిరిసిల్ల చేరుకున్న అనంతరం అంబేద్కర్ చౌరస్తా నుంచి సభా ప్రాంగణం వరకు రేవంత్‌రెడ్డి ర్యాలీగా వెళ్లనున్నారు. అనంతరం సభా ప్రాంగణం వద్ద చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయనున్నారు. సిరిసిల్లలో చేపట్టనున్న అభివృద్ధి కార్యక్రమాలపై ఈ సందర్భంగా అధికారులతో పాటు ప్రజాప్రతినిధులతో చర్చించనున్నారు. అనంతరం నిర్వహించే బహిరంగ సభలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రసంగించనున్నారు. పర్యటనలో భాగంగా ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, భవిష్యత్ ప్రణాళికలను సీఎం ప్రజలకు వివరించే అవకాశం ఉంది.



# మహిళా ఎమ్మెల్యేలపై దురుసు వైఖరి

## పోలీసులపై విచారణకు హైకోర్టు ఆదేశం

అసెంబ్లీ ప్రవేశద్వారం వద్ద మహిళా ఎమ్మెల్యేలతో దురుసుగా ప్రవర్తించిన పోలీసు అధికారులను గుర్తించాలని తెలంగాణ హైకోర్టు డీజీపీని ఆదేశించింది. సెప్టెంబర్ 7న బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను అసెంబ్లీలోకి పోలీసులు అడ్డుకున్న ఘటనపై దాఖలైన పిటిషన్‌ను జస్టిస్ టీ. మాధవీదేవి మంగళవారం విచారించారు. గతంలో ఇచ్చిన ఆదేశాలను సవరించిన కోర్టు, ఘటనకు సంబంధించిన నివేదికను అసెంబ్లీ స్పీకర్‌కు అందించాలని సూచించింది. ఘటన అసెంబ్లీ ప్రాంగణం వెలుపల, ప్రవేశద్వారం వద్ద జరిగి ఉంటే ఆ నివేదికను కోర్టుకు కూడా సమర్పించాలని డీజీపీని ఆదేశించింది. మహిళా ఎమ్మెల్యేలను పోలీసులు ఎందుకు బీఆర్ఎస్ భవన్‌కు తరలించారనే దానిపై కూడా అధికారులు వివరణ ఇవ్వలేదని కోర్టు పేర్కొంది.

### చర్యలు తీసుకునేది స్పీకరే

అసెంబ్లీ నిబంధనలు ఉల్లంఘించినట్లయితే చర్యలు తీసుకునే అధికారం స్పీకర్‌కే ఉంటుందని, పోలీసులకు కాదని హైకోర్టు స్పష్టం చేసింది. ఘటనపై ఎర్రర్ చేసిన పోలీసు అధికారులను గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని, నివేదికను బెంచ్‌కు సమర్పించాలని ఆదేశించింది. అయితే పోలీసుల తరఫున అడ్వొకేట్ జనరల్ ఏ. సుదర్శన్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ, నల్ల టీషర్టులతో నినాదాలు చేయడంపై పోలీసులు ఎమ్మెల్యేలను అడ్డుకున్నారని తెలిపారు. హరీశ్‌రావు పోలీసులను బెదిరించారని, కేటీఆర్ మహిళా పోలీసులపై అభ్యంతరకర వ్యాఖ్యలు చేశారని ఆరోపించారు. కొందరు ఎమ్మెల్యేలు బలవంతంగా లోపలికి వెళ్లేందుకు ప్రయత్నించారని వాదించారు.

### నిషేధాజ్ఞలపై కోర్టు కీలక వ్యాఖ్యలు

పోలీసుల వాదనలపై స్పందించిన హైకోర్టు, ఎఫ్ఐఆర్‌లో నిషేధాజ్ఞల ఉల్లంఘన ప్రస్తావన లేదని గుర్తించింది. అసెంబ్లీ చుట్టూ నాలుగు కిలోమీటర్ల పరిధిలో ప్రజా సమావేశాలు, ప్రదర్శనలపై ఆంక్షలు ఉన్నా ఎమ్మెల్యేలు అసెంబ్లీ, మండలిలోకి ప్రవేశించడంపై నిషేధం లేదని పేర్కొంది. మహిళా ఎమ్మెల్యేలు పోలీసులతో దురుసుగా ప్రవర్తించినట్లు ఎలాంటి ఆరోపణలు లేదా ఆధారాలు లేవని కోర్టు ఆదేశాల్లో స్పష్టం చేసింది. సెప్టెంబర్ 7న బీఆర్ఎస్ లెజిస్లేచర్ పార్టీ పిటిషన్‌పై కోర్టు తదుపరి రోజు నుంచి ఎమ్మెల్యేలను అసెంబ్లీలోకి అడ్డుకోవద్దని ఆదేశించిన విషయాన్ని కూడా తాజా ఉత్తర్వుల్లో ప్రస్తావించింది.

# మోడీని ఎదుర్కోలేక ఆరోపణలు

- ఈసీ, ఈవీఎంలపై విమర్శలు
- కాంగ్రెస్‌పై బండి సంజయ్ ఫైర్



ప్రధాని నరేంద్ర మోదీని రాజకీయంగా ఎదుర్కొనే ధైర్యం లేకే కాంగ్రెస్ ఈసీ, ఈవీఎంలు, ఎస్ఐఆర్‌పై ఆరోపణలు చేస్తోందని కేంద్ర మంత్రి బండి సంజయ్ విమర్శించారు. ఎన్నికల్లో గెలిచే సత్తా లేక కాంగ్రెస్ నిరాధార ఆరోపణలు చేస్తోందని మండిపడ్డారు. మోదీ ప్రభుత్వం వరుసగా మూడుసార్లు ప్రజల మద్దతు పొందిందని, దేశ ఆర్థిక ప్రగతిలో ముందుకు తీసుకెళ్తున్న ప్రభుత్వాన్ని బ్రిటిష్ పాలనతో పోల్చడం ప్రజాస్వామ్యాన్ని అవమానించడమేనని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ తెలంగాణ, కర్ణాటక, హిమాచల్‌ప్రదేశ్‌లో గెలిచినప్పుడు ఈవీఎంలు, ఎన్నికల సంఘం పనితీరుపై ఎందుకు ప్రశ్నలు రాలేదని బండి సంజయ్ నిలదీశారు. కేరళలో ఎస్ఐఆర్ ద్వారా బోగస్ ఓట్లు, మరణించిన వారి ఓట్లు తొలగించడం తమకు ప్రయోజనకరంగా ఉందని కాంగ్రెస్ నేత రమేశ్ చెన్నితల చెప్పిన విషయాన్ని ఆయన ప్రస్తావించారు.

### ఓటరు జాబితా పవిత్రంగా ఉండాలి

ఎస్ఐఆర్ కొత్త ప్రక్రియ కాదని, గతంలోనూ అమలైందని, సుప్రీంకోర్టు దీనిని సమర్థించిందని బండి సంజయ్ తెలిపారు. అర్హులైన ఓటర్ల హక్కు కాపాడుతూనే డూప్లికేట్, మరణించిన వారి ఓట్లు తొలగించడమే ప్రక్రియ ఉద్దేశమని చెప్పారు. ఎస్ఐఆర్‌ను అమలు చేసేది రాష్ట్ర ప్రభుత్వ అధికారులేనని, అయినా కాంగ్రెస్ కేంద్రంపై బాధ్యత నెట్టడం సరికాదని విమర్శించారు. ఓటు ఎంత పవిత్రమో ఓటరు జాబితా కూడా అంతే పవిత్రంగా ఉండాలని ఆయన అన్నారు. కాంగ్రెస్ చేస్తున్న ప్రచారం ప్రజలను తప్పుదోవ పట్టించేలా ఉందని బండి సంజయ్ ఆరోపించారు.

# ప్రత్యర్థులకు కొండంత వార్నింగ్

### మహిళలతోనే కొట్టిస్తానన్న సురేఖ



తెలంగాణ రాజకీయాల్లో కొంతకాలంగా మౌనంగా ఉన్న మాజీ మంత్రి, వరంగల్ తూర్పు ఎమ్మెల్యే కొండా సురేఖ మరోసారి రాజకీయంగా యాక్టివ్ అయ్యారు. సీఎం రేవంత్‌రెడ్డి వర్సెస్ కొండా సుస్మిత వ్యవహారంతో తలెత్తిన వివాదాల నేపథ్యంలో ఆమె మంత్రివర్గం నుంచి బర్తరఫ్ అయిన తర్వాత కొంతకాలం రాజకీయంగా సైలెంట్‌గా ఉన్నారు. తాజాగా వరంగల్ జిల్లా రాజకీయాల్లో మళ్లీ చురుకుగా వ్యవహరిస్తూ ప్రత్యర్థులపై తీవ్ర వ్యాఖ్యలు చేశారు. తమపై అవాకులు చవాకులు మాట్లాడితే ఊరుకునేది లేదని, అవసరమైతే తమ వర్గంలోని మహిళలే ప్రత్యర్థులను ఎదుర్కొంటారని ఘాటు వ్యాఖ్యలు చేశారు. మంగళవారం వరంగల్‌లోని తన క్యాంపు కార్యాలయంలో సీఎంఆర్ఎఫ్, కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న ఆమె 112 మంది లబ్ధిదారులకు చెక్కులు అందజేశారు.

### ఎంజీఎం ఘటనపై ప్రతిపక్షాలపై ఫైర్

ఇటీవల వరంగల్ ఎంజీఎం ఆసుపత్రిలో పైకప్పు పెచ్చులూడి పలువురికి గాయాలైన ఘటనపై బీఆర్ఎస్, బీజేపీ నేతలు చేస్తున్న నిరసనలపై సురేఖ స్పందించారు. ఈ ఘటనలో ప్రాణనష్టం జరగకపోవడం అదృష్టమని, దీనిపై ప్రతిపక్షాలు చేస్తున్న నిరసనలు హాస్యాస్పదంగా ఉన్నాయని వ్యాఖ్యానించారు. పేదలకు మెరుగైన వైద్యం అందించేందుకు సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిని త్వరలోనే అందుబాటులోకి తీసుకువస్తామని తెలిపారు. వరంగల్ నూతన కలెక్టరేట్ భవన నిర్మాణ పనులు కూడా దాదాపు పూర్తయ్యాయని చెప్పారు. కొన్ని ఫర్నిచర్, రంగుల పనులు మాత్రమే మిగిలి ఉన్నాయని వెల్లడించారు.



# పేదల ఇళ్లపై బుల్డోజర్లు ఎందుకు?

## మద్దూరు ఇళ్ల కూల్చివేతపై హరీశ్‌రావు ఫైర్



కొడంగల్ ప్రజల ఇళ్లనే కూల్చివేస్తారా? అంటూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై బీఆర్ఎస్ సీనియర్ నేత, మాజీ మంత్రి హరీశ్‌రావు తీవ్ర విమర్శలు చేశారు. మద్దూరులో పేదల ఇళ్లపై రాత్రికి రాత్రే బుల్డోజర్లు నడిపించడంపై ఆయన ప్రశ్నలు సంధించారు. కనీసం నోటీసులు ఇవ్వకుండా ఇళ్లను కూల్చే అధికారం ప్రభుత్వానికి ఎవరిచ్చారని నిలదీశారు. ఏళ్లుగా నివాసం ఉంటున్న కుటుంబాలను ఒక్కసారిగా ఇళ్ల నుంచి ఖాళీ చేయిస్తే వారు ఎక్కడికి వెళ్లాలని ప్రశ్నించారు. అధికారంలో ఉన్నామనే కారణంతో ఇష్టారాజ్యంగా వ్యవహరించడం సరికాదని అన్నారు. పోలీసులను అడ్డుపెట్టుకుని బుల్డోజర్లతో పేదల ఇళ్లను కూల్చడం ప్రజా పాలన ఎలా అవుతుందని హరీశ్‌రావు ప్రశ్నించారు.

### పరిహారం.. పునరావాసం కల్పించాలి

ఇళ్ల కూల్చివేత విషయంలో న్యాయస్థానాలు ఇచ్చిన తీర్పులను ప్రభుత్వం గౌరవించాల్సిందేనని హరీశ్‌రావు అన్నారు. బాధిత కుటుంబాలకు ముందుగా న్యాయం చేయకుండా నిర్మాణాలను తొలగించడం వల్ల పేదల జీవితాలు రోడ్డున పడే పరిస్థితి ఏర్పడుతుందని విమర్శించారు. యూపీఏ ప్రభుత్వం తీసుకొచ్చిన భూసేకరణ చట్టం-2013 ప్రకారం బాధితులకు న్యాయమైన పరిహారం, పునరావాసం కల్పించాలని బీఆర్ఎస్ తరఫున డిమాండ్ చేశారు. పేదల ఇళ్లను తొలగించే ముందు చట్టపరమైన ప్రక్రియను పూర్తిగా పాటించాలని, బాధితుల జీవనోపాధి, నివాస హక్కులను పరిగణనలోకి తీసుకోవాలని కోరారు.



# అగ్నివీరులకు మధ్యప్రదేశ్ సర్కార్ భారీ కోటా

## యూనిఫాం ఉద్యోగాల్లో 20 శాతం రిజర్వేషన్

మధ్యప్రదేశ్ ప్రభుత్వం అగ్నివీరులకు కీలక అవకాశం కల్పించింది. ముఖ్యమంత్రి మోహన్ యాదవ్ అధ్యక్షతన మంగళవారం జరిగిన కేబినెట్ సమావేశంలో రాష్ట్రంలోని వివిధ యూనిఫాం సేవల్లో అగ్నివీరులకు 20 శాతం రిజర్వేషన్ కల్పిస్తూ నిర్ణయం తీసుకున్నారు. పోలీస్ కానిస్టేబుల్, స్పెషల్ ఆర్మ్‌డ్ ఫోర్స్, జైలు గార్డు, ఫారెస్ట్ గార్డు, ఎక్సైజ్ కానిస్టేబుల్ వంటి ఉద్యోగాలకు ఈ కోటా వర్తించనుంది. అగ్నిపథ్ పథకం ద్వారా సైన్యంలో సేవలందించిన యువతకు రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాల్లో అవకాశాలు పెంచే ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు ప్రభుత్వం వెల్లడించింది.

### మాజీ సైనికులు, హోంగార్డులకు కూడా

అగ్నివీరులతో పాటు మాజీ సైనికులు, హోంగార్డులకు కూడా రాష్ట్ర కేబినెట్ రిజర్వేషన్ ప్రకటించింది. సంబంధిత యూనిఫాం ఉద్యోగాల్లో మాజీ సైనికులకు 5 శాతం, హోంగార్డులకు 10 శాతం కోటా ఇవ్వాలని నిర్ణయించింది. హోం శాఖలో కానిస్టేబుల్ జనరల్ డ్యూటీ నియామకాల్లో ఈ రిజర్వేషన్లు అమలు కానున్నాయి. SAF, జైలు గార్డు, ఫారెస్ట్ గార్డు, ఎక్సైజ్ కానిస్టేబుల్ పోస్టులకు కూడా ఇదే విధానం వర్తిస్తుందని ప్రభుత్వం తెలిపింది. యువతకు ఉద్యోగ అవకాశాలు పెంచడం తమ లక్ష్యమని కేబినెట్ నిర్ణయాన్ని ప్రభుత్వం వివరించింది.

### గ్వాలియర్-చంబల్‌పై ప్రత్యేక ప్రభావం

మధ్యప్రదేశ్‌లోని గ్వాలియర్‌చంబల్ ప్రాంతంలో సైన్యంలో చేరాలనే ఆసక్తి ఉన్న యువత పెద్ద సంఖ్యలో ఉంటారు. అగ్నిపథ్ పథకంపై 2022లో దేశవ్యాప్తంగా నిరసనలు జరిగిన సమయంలో ఈ ప్రాంతంలోనూ ఆందోళనలు తీవ్రంగా సాగాయి. అగ్నిపథ్ పథకం కింద సైనికులను నాలుగేళ్ల కాలానికి నియమిస్తారు. ఈ విధానంలో నియమితులైన వారిని అగ్నివీరులుగా పిలుస్తారు. సైనిక సేవ అనంతరం ఉద్యోగ అవకాశాలపై అప్పట్లో వ్యక్తమైన ఆందోళనల నేపథ్యంలో మధ్యప్రదేశ్ తాజా నిర్ణయం ప్రాధాన్యం సంతరించుకుంది.



# నాతో పెట్టుకోకు..!

- అన్నకు సిస్టర్ స్వీట్ వార్నింగ్
- పార్టీ నిర్ణయాలపై కవిత ప్రశ్నలు

తెలంగాణ రాజకీయాల్లో బీఆర్ఎస్ అంతర్గత వ్యవహారాలు మరోసారి హాట్ టాపిక్‌గా మారాయి. తెలంగాణ రాష్ట్ర సేన అధ్యక్షురాలు కవిత తాజాగా చేసిన వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో చర్చకు దారితీశాయి. పార్టీ నేతలపై తీవ్ర విమర్శలు చేసిన ఆమె, తనను పార్టీ నుంచి సస్పెండ్ చేసిన సందర్భాన్ని ప్రస్తావిస్తూ పలు ప్రశ్నలు సంధించారు. అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న నేతలతో సన్నిహితంగా ఉంటూ, మరోవైపు పార్టీ అధినేత కేసీఆర్‌ను బహిరంగంగా విమర్శించడం ఏ విధంగా పార్టీ ప్రయోజనాలకు అనుకూలమని ప్రశ్నించారు. గతంలో తీసుకున్న నిర్ణయాలు, పార్టీ వైఫల్యాలు, నేతల వ్యవహారశైలిపై కవిత ఘాటుగా స్పందించారు. ఇటీవల బీఆర్ఎస్ సమావేశంలో రైతు, మహిళల పట్ల జరిగినట్టు చెబుతున్న అవమానకర వ్యాఖ్యలను కూడా ఆమె ప్రస్తావించారు. పార్టీని కాపాడాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని, వ్యక్తిగత వైఫల్యాలను అధినేతపై నెట్టడం సరికాదని కవిత స్పష్టం చేశారు. తాను ఆధారాలు లేకుండా మాట్లాడనని చెబుతూ ప్రత్యర్థులకు సవాల్ విసిరారు.

### కవిత సంచలన వ్యాఖ్యలు

తెలంగాణ రాష్ట్ర సేన అధ్యక్షురాలు కవిత బీఆర్ఎస్ నేతలపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. పార్టీలో అవినీతిపై ప్రశ్నించినందుకే తనను గంటల్లో సస్పెండ్ చేశారని ఆమె వ్యాఖ్యానించారు. అదే సమయంలో పార్టీకి నష్టం కలిగించిన వ్యక్తితో కలిసి పనిచేస్తూ, ఇప్పుడు పార్టీ అధినేత తీరును తప్పుబట్టడం ఎలా సమర్థనీయమని ప్రశ్నించారు. పార్టీ నిర్ణయాలు, అధినేత కేసీఆర్‌పై బహిరంగ విమర్శలు చేయడం కూడా పార్టీ వ్యతిరేక చర్య కాదా అని నిలదీశారు. కేసీఆర్ విధానపరమైన నిర్ణయాలను బహిరంగంగా తప్పుబడుతున్న నేతలు ఇప్పుడు పార్టీ ప్రయోజనాల గురించి మాట్లాడటం విడ్డూరంగా ఉందని కవిత అన్నారు. ఫామ్‌హౌస్‌లు, అక్రమ అనుమతులు, ఆంధ్రా దోస్తులకు ఇచ్చిన నజరానాలు, క్విడ్ ప్రోకో వ్యవహారాలు బీఆర్ఎస్‌ను పాతాళానికి నెట్టాయని చేస్తున్న ఆరోపణలను ఆమె ప్రస్తావించారు. పార్టీలో జరిగిన వైఫల్యాలకు బాధ్యత వహించకుండా ఆ భారాన్ని బీఆర్ఎస్ అధినేతపై మోపడం సరికాదని వ్యాఖ్యానించారు. పార్టీలోని వైఫల్యాలను అధినేతపై మోపడం కూర్చున్న కొమ్మనే నరుక్కోవడం లాంటిదని కవిత వ్యాఖ్యానించారు. "నేను విషనాగుల మాటలు విని మాట్లాడను.. నిర్దిష్టమైన ఆధారాలతోనే మాట్లాడుతాను.. నాతో పెట్టుకోకు" అంటూ కవిత ఘాటైన హెచ్చరిక చేశారు.

# అందరి సంక్షేమమే అసలైన అభివృద్ధి

- చివరి వ్యక్తి బాగుంటేనే దేశం బాగుంటుంది
- తేల్చి చెప్పిన ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్

అభివృద్ధి అంటే కొందరి జీవితాలు మాత్రమే మెరుగుపడటం కాదని ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్ అన్నారు. మహారాష్ట్రలోని యవత్మాల్‌లో పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ జయంతి సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ సమాజంలోని చివరి వ్యక్తి సంక్షేమాన్ని అభివృద్ధికి కేంద్రంగా ఉంచాలని సూచించారు. అందరూ ఒకే స్థాయికి చేరుకోవడం సాధ్యం కాకపోవచ్చని, అయితే అత్యంత వెనుకబడిన వ్యక్తి నుంచి అత్యున్నత స్థాయిలో ఉన్న వ్యక్తి వరకు అభివృద్ధి వ్యత్యాసం సాధ్యమైనంత తక్కువగా ఉండాలని చెప్పారు. సమాజంలోని చివరి వ్యక్తి సంతోషంగా ఉంటేనే దేశం సంతోషంగా ఉంటుందని, ఇదే 'అంత్యోదయ' భావన అని భగవత్ వివరించారు.

### అవసరాలు తీరాలి.. ప్రకృతి కాపాడాలి

అభివృద్ధి ప్రతి వ్యక్తికి ఆహారం, దుస్తులు, ఇల్లు, విద్య, వైద్యం వంటి ప్రాథమిక అవసరాలను అందించేలా ఉండాలని భగవత్ పేర్కొన్నారు. ప్రజలు గౌరవంగా జీవించే పరిస్థితులు ఏర్పడటంతో పాటు ఇతరులకు ఆతిథ్యం ఇచ్చే సామర్థ్యం కూడా పెరగాలని అన్నారు. అభివృద్ధి పేరుతో ప్రకృతికి నష్టం కలగకూడదని స్పష్టం చేశారు. వ్యవసాయ రంగంలో రైతుల సంక్షేమానికి ప్రాధాన్యం ఇస్తూనే భూమి ఆరోగ్యాన్ని కాపాడాలని సూచించారు. సేంద్రియ, మిశ్రమ వ్యవసాయం, పశుపోషణతో పాటు విత్తనాలు, ఎరువులు, పురుగుమందుల విషయంలో స్వయం ఆధారితత పెరగాలని అన్నారు. రైతులు అప్పుల ఊబిలో




చిక్కుకోకుండా స్వావలంబన సాధించడమే లక్ష్యంగా ఉండాలని సూచించారు.

### అభివృద్ధి బాధ్యత సమాజానిదే

దీన్‌దయాళ్ ఉపాధ్యాయ్ ఆలోచనలను ప్రస్తావించిన భగవత్, అభివృద్ధి అనేది గరిష్ఠ ప్రజలకు గరిష్ఠ ప్రయోజనం మాత్రమే కాదని, ప్రతి ఒక్కరి మేలు లక్ష్యంగా ఉండాలని వివరించారు. నిర్ణయం తీసుకునే ముందు సమాజంలోని అట్టడుగు వ్యక్తిపై దాని ప్రభావం ఎలా ఉంటుందో ఆలోచించాలన్న మహాత్మా గాంధీ సూత్రాన్ని కూడా గుర్తుచేశారు. అభివృద్ధి బాధ్యత కేవలం ప్రభుత్వానిదే కాదని, సమాజం కూడా ముందుకు తీసుకెళ్లాల్సిన బాధ్యత ఉందన్నారు. మానవులతో పాటు జంతువులు, పక్షులు, ప్రకృతి సంక్షేమాన్ని కలిపి చూడడమే సమగ్ర మానవతావాదం అని పేర్కొన్నారు.



# ఆ ఓటర్లపై కాంగ్రెస్ వైఖరేంటి?

- ఈసీపై కాంగ్రెస్‌కు బీజేపీ కౌంటర్

ఎన్నికల సంఘంపై కాంగ్రెస్ చేస్తున్న విమర్శలపై బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి స్మృతి ఇరానీ తీవ్రంగా స్పందించారు. ప్రస్తుత ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రజల మద్దతు పొందలేకపోతున్న కాంగ్రెస్ ఇప్పుడు ఎన్నికల వ్యవస్థను బలహీనపరిచే ప్రయత్నం చేస్తోందని ఆమె ఆరోపించారు. ఢిల్లీలోని బీజేపీ కార్యాలయంలో మంగళవారం మీడియాతో మాట్లాడిన ఇరానీ, ఎన్నికల సంఘంపై కాంగ్రెస్ దాడి చేయడం ప్రజాస్వామ్య సంస్థలపై నమ్మకాన్ని దెబ్బతీసే చర్యగా అభివర్ణించారు. ఇటీవల కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సీఈసీ జ్ఞానేశ్ కుమార్ తొలగింపు, సర్ నిలిపివేత, తొలగించిన ఓటర్ల పేర్ల పునరుద్ధరణతో పాటు ప్రధాని మోదీ రాజీనామాను డిమాండ్ చేసిన నేపథ్యంలో ఆమె ఈ వ్యాఖ్యలు చేశారు.

### మృతుల పేర్లు ఎందుకు ఉండాలి?

సర్ ప్రక్రియలో భాగంగా ఓటర్ల జాబితాలో ఉన్న మృతుల పేర్లు, డూప్లికేట్ ఎంట్రీలను తొలగించడంపై ఈసీ వివరణ ఇచ్చిందని ఇరానీ గుర్తుచేశారు. మృతుల పేర్లు తిరిగి చేర్చాలని కాంగ్రెస్ ఎందుకు కోరుతోంది? డూప్లికేట్ పేర్లు కొనసాగాలని ఎందుకు పట్టుబడుతోంది? అని ఆమె ప్రశ్నించారు. సర్ నోటీసులు అందుకున్న వ్యక్తుల ఇళ్లకు బూత్ లెవల్ అధికారులు స్వయంగా వెళ్లి పత్రాలు తీసుకుని వివరాలు పరిశీలిస్తారని ఈసీ ఇప్పటికే స్పష్టం చేసిందని చెప్పారు. అలాంటప్పుడు కాంగ్రెస్ అభ్యంతరాల వెనుక కారణమేంటని ఇరానీ ప్రశ్నించారు.

### రాష్ట్రాల వారీగా కాంగ్రెస్‌కు ప్రశ్నలు

హిమాచల్‌ప్రదేశ్, పంజాబ్, కేరళ, కర్ణాటక వంటి రాష్ట్రాల్లో బీజేపీ అధికారంలో లేదని గుర్తుచేసిన ఇరానీ, అక్కడి ఓటర్ల జాబితాల విషయంలో కాంగ్రెస్ ఈసీపై ఇదే స్థాయిలో విమర్శలు చేస్తుందా అని ప్రశ్నించారు. ఎన్నికల సంఘం విషయంలో కాంగ్రెస్ ద్వంద్వ వైఖరి అవలంబిస్తోందని ఆమె ఆరోపించారు. 2019లో కాంగ్రెస్ అప్పటి జాతీయ అధ్యక్షుడు మోదీ ప్రతిష్ఠను దెబ్బతీసేందుకు సాధ్యమైనంతగా ప్రయత్నిస్తానని చెప్పిన విషయాన్ని కూడా ఆమె ప్రస్తావించారు. మోదీని విమర్శించవచ్చని, అయితే రాజ్యాంగ సంస్థలను లక్ష్యంగా చేసుకోవద్దని ప్రధాని పలుమార్లు చెప్పారని ఇరానీ గుర్తుచేశారు.

### ఈసీ ప్రజాస్వామ్య గౌరవానికి ప్రతీక: ఇరానీ

కాంగ్రెస్ తన ఎన్నికల పరాజయాలపై ఆత్మపరిశీలన చేయకుండా ఎన్నికల సంఘంపై నిందలు వేస్తోందని ఇరానీ ఆరోపించారు. భారత ప్రజాస్వామ్యానికి ఎన్నికల సంఘం కీలక సంస్థ అని, ప్రపంచవ్యాప్తంగా దానికి గౌరవం ఉందని పేర్కొన్నారు. సర్పై ఈసీ ఇప్పటికే ప్రజలకు వివరణ ఇచ్చిందని, బీఎల్వోల ద్వారా వ్యక్తిగతంగా వివరాల పరిశీలన జరుగుతుందని తెలిపారు. ఈ నేపథ్యంలో ఓటర్ల జాబితా ప్రక్షాళనపై కాంగ్రెస్ చేస్తున్న అభ్యంతరాలను ఆమె ప్రశ్నించారు. ఎన్నికల ప్రక్రియపై ప్రజల్లో నమ్మకం కొనసాగాలంటే రాజ్యాంగ సంస్థలపై దాడులు కాకుండా వాస్తవాల ఆధారంగా చర్చ జరగాలని బీజేపీ నేత సూచించారు.

# సీఈసీ రాజీనామా చేయాల్సిందే

- కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ తీర్మానం




సీఈసీ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ డిమాండ్ చేస్తూ కీలక తీర్మానం చేసింది. మల్లికార్జున్ ఖర్గే అధ్యక్షతన సుమారు రెండున్నర గంటలపాటు జరిగిన సమావేశంలో ఎన్నికల జాబితా సవరణ, సర్ వ్యవహారంపై పార్టీ తదుపరి కార్యాచరణను చర్చించారు. జ్ఞానేశ్ కుమార్ ఎన్నికల కమిషన్ సంస్థాగత అధికారాన్ని కోల్పోయారని కాంగ్రెస్ ఆరోపించింది. సర్ను వెంటనే నిలిపివేయాలని, దాని కారణంగా తొలగించబడిన 13.30 కోట్ల పేర్లను పునరుద్ధరించాలని డిమాండ్ చేసింది. ఈ అంశంపై పార్లమెంట్, కోర్టులు, ప్రజా ఉద్యమాల ద్వారా పోరాటం కొనసాగిస్తామని ప్రకటించింది.

### మోదీ, షాపై కాంగ్రెస్ ఆరోపణలు

ఓటు చోరీ పేరుతో కాంగ్రెస్ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షాపైనా రాజకీయ ఆరోపణలు చేసింది. ఎన్నికల ప్రక్రియలో అవకతవకలు జరిగాయని కాంగ్రెస్ పేర్కొంటూ, మోదీ, షా రాజీనామా చేయాలని తీర్మానంలో కోరింది. ఎన్నికల వ్యవస్థపై ప్రజలకు నమ్మకం కలిగేలా అన్ని వివరాలు బహిర్గతం చేయాలని పార్టీ డిమాండ్ చేసింది. అయితే ఇవి కాంగ్రెస్ చేసిన ఆరోపణలు మాత్రమేనని, వాటిపై సంబంధిత సంస్థల వైఖరి వేరుగా ఉందన్న అంశాన్ని కూడా గమనించాల్సి ఉంది.

### ఖర్గే ఐదు కీలక డిమాండ్లు

సమావేశంలో ఖర్గే ఎన్నికల జాబితాలో జరిగిన మార్పులన్నింటి డేటాను బహిరంగం చేయాలని కోరారు. పేర్లు తొలగించబడిన ప్రతి ఓటరుకు అప్పీల్ చేసుకునే అవకాశం ఇవ్వాలని, రాజకీయ పార్టీలకు ఓటర్ల జాబితాలను సకాలంలో సులభమైన రూపంలో అందించాలని డిమాండ్ చేశారు. తీవ్రమైన అనుమానాలు ఉన్న ప్రాంతాల్లో స్వతంత్ర, కాలపరిమితితో కూడిన దర్యాప్తు జరపాలని సూచించారు. ఎన్నికల ప్రక్రియలో ఏ సమాచారం దాచిపెట్టలేదన్న నమ్మకం ప్రజలకు కలిగేలా పారదర్శక విధానం ఉండాలని ఖర్గే అన్నారు.

### రాహుల్ పోరాటానికి సీడబ్ల్యూసీ మద్దతు

కాంగ్రెస్ నేత కేసీ వేణుగోపాల్ మాట్లాడుతూ, 'ఓటు చోరీ' అంశాన్ని గత 18 నెలలుగా రాహుల్ గాంధీ నిరంతరం లేవనెత్తుతున్నారని చెప్పారు. ఈ అంశాన్ని పార్టీ తరఫున ముందుకు తీసుకెళ్లినందుకు సీడబ్ల్యూసీ ఆయనను అభినందించిందన్నారు. ఎన్నికల జాబితాల్లో పారదర్శకత, ప్రతి ఓటు రక్షణ, ఎన్నికల సంఘం స్వతంత్రత తమ ప్రధాన డిమాండ్లని స్పష్టం చేశారు. సంస్థలు స్వతంత్రంగా పనిచేయాలని, ఓటర్ల హక్కులకు రక్షణ ఉండాలని ఖర్గే పేర్కొన్నారు. ఈ అంశాన్ని పార్లమెంట్‌లో లేవనెత్తడంతో పాటు అవసరమైతే రోడ్లపై కూడా నిరసనలు చేపడతామని కాంగ్రెస్ నాయకత్వం తెలిపింది.

## సీఈసీ జ్ఞానేశ్‌పై సుప్రీంకోర్టులో పిటిషన్

- వచ్చే వారం విచారణకు అంగీకారం



ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌ను పదవి నుంచి తాత్కాలికంగా సస్పెండ్ చేయాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌పై సుప్రీంకోర్టు కీలక నిర్ణయం తీసుకుంది. పిటిషన్‌ను వచ్చే వారం విచారణకు లిస్ట్ చేసేందుకు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ అంగీకరించారు. పిటిషనర్ రాకేశ్ కుమార్ సింగ్ తరఫున సీనియర్ న్యాయవాది వికాస్ సింగ్, న్యాయవాదులు సుదీప్ చంద్ర, ముదిత్ గుప్తా ముందస్తు విచారణ కోరుతూ మౌఖికంగా ప్రస్తావించారు. తుది తీర్పు వెలువడే వరకు జ్ఞానేశ్ కుమార్ ప్రధాన ఎన్నికల కమిషనర్ విధులు నిర్వహించకుండా ఆదేశాలు ఇవ్వాలని పిటిషన్‌లో కోరారు.

### ఈసీ నిర్ణయాలు సమష్టిగానే ఉండాలి

ఎన్నికల కమిషన్ వ్యవహారాలను ఒక వ్యక్తి కాకుండా మొత్తం కమిషన్ నిర్వహించాల్సి ఉంటుందని పిటిషనర్ వాదించారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 324(1) ఎన్నికల నిర్వహణ బాధ్యతను వ్యక్తిగత సీఈసీకి కాకుండా ఎన్నికల కమిషన్‌కు అప్పగించిందని పేర్కొన్నారు. ఎన్నికల కమిషనర్లు నిర్ణయ ప్రక్రియలో భాగస్వాములు కావాలని 1995లోని టి.ఎన్. శేషన్ కేసు తీర్పును పిటిషన్ ప్రస్తావించింది. సీఈసీ అభిప్రాయమే తుది నిర్ణయంగా మారితే మిగిలిన కమిషనర్ల పాత్ర నామమాత్రంగా మారుతుందని వాదించింది. జ్ఞానేశ్ కుమార్ కమిషన్ చైర్మన్‌గా కాకుండా మొత్తం కమిషన్ తరఫున ఏకపక్షంగా వ్యవహరించారన్న ఆరోపణలను కూడా పిటిషన్ ప్రస్తావించింది.

### 2023 చట్టంలోని నిబంధనలపై వాదన

2023లో రూపొందిన చీఫ్ ఎలక్షన్ కమిషనర్, ఇతర ఎలక్షన్ కమిషనర్ల నియామకం, సేవా నిబంధనల చట్టంలోని సెక్షన్ 18ను పిటిషనర్ ప్రధానంగా ప్రస్తావించారు. సాధ్యమైనంత వరకు కమిషన్ వ్యవహారాలు ఏకగ్రీవంగా జరగాలని, అభిప్రాయ భేదాలు ఉంటే మెజారిటీ నిర్ణయం అమలులోకి రావాలని ఆ నిబంధన చెబుతోందని వాదించారు. సీఈసీకి వ్యక్తిగతంగా ఎన్నికల కమిషన్ అధికారాలన్నీ ఉండవని పిటిషన్ పేర్కొంది. ఏకగ్రీవ నిర్ణయం లేకుండా, మెజారిటీ ఆమోదం లేకుండా సీఈసీ స్వతంత్రంగా ఆదేశాలు ఇవ్వగలరా? అన్న అంశాన్ని కోర్టు పరిశీలించాలని కోరారు.

### రికార్డుల పరిరక్షణకు కూడా డిమాండ్

సర్, ఫామ్ 6 మార్పులు, ఈఆర్వోనెట్, ఈసీఐనెట్, వంటి వ్యవస్థలకు సంబంధించిన కీలక రికార్డులను భద్రపరచాలని పిటిషన్ కోరింది. సమావేశాల మినిట్స్, ఫైల్ నోటింగ్స్, ఆదేశాలు, అధికారుల మధ్య ఉత్తరప్రత్యుత్తరాలు, సర్వర్ లాగ్స్, ఆడిట్ ట్రైల్స్, డేటాబేస్ మార్పుల చరిత్ర, సాఫ్ట్‌వేర్ వివరాలు వంటి సమాచారాన్ని అక్టోబర్ 1, 2025 నుంచి భద్రపరచాలని విజ్ఞప్తి చేసింది. అలాగే ఫామ్ 6లో మరిన్ని మార్పులు చేయకుండా ఆదేశించాలని, వివాదాస్పద వివరాలు సమర్పించలేదనే కారణంతో అర్హులైన ఓటర్లను జాబితాలో చేర్చకుండా నిరోధించకూడదని కోరింది. వచ్చే వారం విచారణతో సీఈసీ అధికార పరిధి, ఈసీ సమష్టి నిర్ణయ విధానంపై న్యాయపరమైన పరిశీలనకు మార్గం సుగమమైంది.



# యువత వీధుల్లోకి రావాలి

- మహిళల భద్రతపై రాహుల్ గాంధీ పిలుపు

కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ మహిళలపై వేధింపులు, అత్యాచారాలకు వ్యతిరేకంగా యువత పెద్ద ఎత్తున నిరసనలకు రావాలని పిలుపునిచ్చారు. మంగళవారం విడుదల చేసిన వీడియో సందేశంలో మహిళలను ఇళ్లకే పరిమితం చేయడం పరిష్కారం కాదని స్పష్టం చేశారు. దేశవ్యాప్తంగా మహిళలు రోడ్లపై నడవాలంటే భయపడుతున్నారని, వేధింపులు, అత్యాచారాల భయంతో జీవిస్తున్నారని అన్నారు. ప్రభుత్వం మహిళల స్వేచ్ఛను పరిమితం చేయడం కాకుండా నేరాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన పేర్కొన్నారు.

### బాధితురాలినే నిందించొద్దు

మహిళలపై జరిగే నేరాలకు వారినే బాధ్యులుగా చూపించే వ్యవస్థను మార్చాల్సిన అవసరం ఉందని రాహుల్ అన్నారు. నేరం చేసిన వ్యక్తే నేరస్థుడు.. బాధితురాలికి ఎలాంటి తప్పు ఉండదు అని స్పష్టం చేశారు. మహిళలను రాత్రివేళ పార్కులకు వెళ్లొద్దని చెప్పడం, వారి జీవన విధానాన్ని నియంత్రించడం సరైన మార్గం కాదన్నారు. ఢిల్లీలో పార్క్ సమీపంలో 16 ఏళ్ల బాలికపై జరిగిన అత్యాచారాన్ని ప్రస్తావిస్తూ, ఘటన తర్వాత మహిళలపై ఆంక్షలు విధించాలనే ఆలోచనను ఆయన తప్పుబట్టారు.

### ప్రభుత్వంపై ఒత్తిడి పెంచాలి

దేశంలోని వివిధ రాష్ట్రాల్లో మహిళలపై నేరాలు జరుగుతున్నాయని రాహుల్ పేర్కొన్నారు. బిహార్, ఉత్తరప్రదేశ్, పంజాబ్ వంటి రాష్ట్రాల్లోనూ ఘటనలు వెలుగులోకి వస్తున్నాయని ఆయన అన్నారు. నేరాల తర్వాత మహిళల స్వేచ్ఛను తగ్గించడం సమస్యకు పరిష్కారం కాదని స్పష్టం చేశారు. నేరస్థులను వేగంగా శిక్షించడం, మహిళలను వేధించే పురుషుల ఆలోచనా విధానాన్ని మార్చడం, పోలీసింగ్‌ను మరింత బాధ్యతాయుతంగా మార్చడం అవసరమని సూచించారు. ప్రభుత్వం ప్రజల డిమాండ్లను పట్టించుకునేలా నిరసనల ద్వారా ఒత్తిడి తీసుకురావాలని అన్నారు.

### జెన్-జెడ్‌కు ప్రత్యేక పిలుపు

మహిళల భద్రత కోసం ఇప్పటికే వేలాది మంది విద్యార్థులు, యువత రోడ్లపైకి వచ్చి నిరసనలు చేస్తున్నారని రాహుల్ చెప్పారు. దేశవ్యాప్తంగా మరింత మంది యువతులు, ముఖ్యంగా జెన్‌జెడ్ యువతులు పెద్ద సంఖ్యలో ముందుకు రావాలని పిలుపునిచ్చారు. శాంతియుతంగా నిరసన తెలిపే హక్కు ప్రతి ఒక్కరికీ ఉందని, మహిళల భద్రత కోసం పోరాడే వారికి తాను పూర్తిగా అండగా ఉంటానని తెలిపారు. మహిళలను వేధించడం ఆపాలని, నేరస్థులను శిక్షించాలని, నేరాలకు కారణమయ్యే ఆలోచనా విధానంలో మార్పు రావాలని రాహుల్ స్పష్టం చేశారు.

# ఉద్యోగాలు వద్దు.. కార్లు కొనండి.. డ్రైవర్లు కండి!

- యువతకు యూపీ డిప్యూటీ సీఎం హితవు

**ఉద్యోగం కోసం చదువుకున్నారా? పోటీ పరీక్షలు రాశారా? నోటిఫికేషన్ కోసం ఎదురుచూస్తున్నారా? అయితే ఆ టెన్షన్ అంతా ఎందుకు.. ఒక కారు కొనుక్కోండి.. ట్యాక్సీ నడపండి.. మీరే బాస్.. మీరే డ్రైవర్.. మీరే ఉద్యోగి.. అన్నట్టుగా ఉత్తరప్రదేశ్ డిప్యూటీ సీఎం బ్రజేశ్ పాఠక్ యువతకు ఇచ్చిన సలహా ఇప్పుడు వ్యంగ్యానికి వేదికగా మారింది.**

ఉత్తరప్రదేశ్ డిప్యూటీ సీఎం బ్రజేశ్ పాఠక్ చేసిన ఉద్యోగాలపై వ్యాఖ్యలు రాజకీయ వివాదానికి దారితీశాయి. సెప్టెంబర్ 23న లక్నోలో భారత్ ట్యాక్సీ ప్రారంభ కార్యక్రమంలో మాట్లాడిన ఆయన, యువత ఉద్యోగాల కోసం పరుగులు తీయకుండా సొంత వాహనం కొనుగోలు చేసి ట్యాక్సీ నడపడం ద్వారా స్వయం ఉపాధి పొందాలని సూచించారు. సొంత వాహనం, సొంత శ్రమ, సొంత ఆదాయంతో డబ్బు కుటుంబంలోనే ఉంటుందని చెప్పారు. ప్రభుత్వం సులభ రుణాల ద్వారా వాహనాలు కొనుగోలు చేసేందుకు యువతకు సహాయం చేస్తుందని తెలిపారు.

### కుటుంబానికి సమయం ఉంటుందన్న వాదన

ట్యాక్సీ నడపడంలో పని సమయాన్ని మనకు అనుగుణంగా మార్చుకోవచ్చని పాఠక్ చెప్పారు. కొన్ని గంటలు వాహనం నడిపి మధ్యాహ్నం ఇంటికి వెళ్లి పిల్లలతో సమయం గడపవచ్చని సూచించారు. అవసరమైన రోజుల్లో అదనంగా మరికొన్ని ట్రిప్పులు చేస్తే ఎక్కువ ఆదాయం పొందవచ్చని ఆయన అన్నారు. డ్రైవింగ్ వృత్తిని తక్కువగా చూడకూడదని, స్వయం ఉపాధి కూడా గౌరవప్రదమైన జీవన మార్గమేనని వివరించారు. భారత్ ట్యాక్సీని ప్రజలు వినియోగించాలని, డ్రైవింగ్ నైపుణ్యం ఉన్న యువత ఈ అవకాశాన్ని పరిశీలించాలని ఆయన కోరారు.

### విపక్షాల నుంచి తీవ్ర విమర్శలు

పాఠక్ వ్యాఖ్యల వీడియో సోషల్ మీడియాలో వైరల్ కావడంతో విపక్ష నేతలు తీవ్రంగా స్పందించారు. ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న యువతకు ప్రభుత్వ ప్రతినిధి ఇచ్చే సమాధానం ట్యాక్సీ నడపమని చెప్పడమేనా? అంటూ ప్రశ్నలు వచ్చాయి. సమాజ్‌వాదీ పార్టీ నేతలు ఈ వ్యాఖ్యలను విమర్శిస్తూ, యువత ఉద్యోగ అవకాశాలను కోరుతున్న సమయంలో స్వయం ఉపాధిని ప్రత్యామ్నాయంగా చూపడం సమస్యను తప్పుదోవ పట్టించడమేనని అన్నారు. సోషల్ మీడియాలో కొందరు పాఠక్ సొంతంగా ట్యాక్సీ ఎప్పుడు కొనుగోలు చేస్తారని ప్రశ్నించారు. దీంతో ఉద్యోగాల కలలు కంటున్న యువత, ప్రభుత్వ బాధ్యతపై చర్చ మొదలైంది.



### ఉద్యోగాలా.. స్వయం ఉపాధా?

పాఠక్ వ్యాఖ్యలు కేవలం రాజకీయ విమర్శలకు మాత్రమే పరిమితం కాకుండా ఉద్యోగాల స్వరూపంపై పెద్ద చర్చకు దారితీశాయి. స్వయం ఉపాధి ద్వారా ఆదాయం పొందే అవకాశాలను ప్రోత్సహించడం ఒక అంశమైతే, స్థిరమైన ఉద్యోగాల కోసం యువత ఎదురుచూడటం మరో అంశం. భారత్ ట్యాక్సీ కార్యక్రమం ప్రధానంగా డ్రైవర్లకు ప్రత్యామ్నాయ ఆదాయ మార్గాన్ని అందించాలనే ఉద్దేశంతో ప్రారంభమైంది. డ్రైవింగ్ వృత్తిలో ఉన్నవారు ఇంధనం, వాహన నిర్వహణ, రుణాలు, పని గంటలు వంటి సమస్యలను ఎదుర్కొంటున్నారనే చర్చ కూడా సాగుతోంది. యువతకు అవకాశాలు కల్పించడంలో ఉద్యోగాలు, స్వయం ఉపాధి రెండింటి స్థానం ఏంటన్న ప్రశ్న ఇప్పుడు రాజకీయ వేదికపైకి వచ్చింది.

# సునీల్ యాదవ్ వ్యాఖ్యలు బాధ్యతారాహిత్యం



పులివెందులలో వైసీపీ నాయకులు సునీల్ యాదవ్ వ్యాఖ్యలపై తీవ్రంగా స్పందించారు. వైఎస్ కుటుంబంపై ఆధారాలు లేకుండా ఆరోపణలు చేయడం బాధ్యతారాహిత్యమని విమర్శించారు. వ్యక్తిగత ప్రచారం కోసం మీడియా ముందు వైఎస్ జగన్, భారతి సహా కుటుంబ సభ్యులపై వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. తనకు ప్రాణహాని ఉందంటూ ఫిర్యాదులు చేస్తూ గన్‌మెన్ భద్రత పొందేందుకు ప్రయత్నిస్తున్నారని వారు ఆరోపించారు. గతంలో ల్యాండ్ సెటిల్‌మెంట్లు, గుప్తనిధుల అన్వేషణ, వజ్రాల వేట వంటి అంశాలపై సునీల్ యాదవ్ ఎదుర్కొన్న ఆరోపణలను సంబంధిత అధికారులు రికార్డుల ఆధారంగా పరిశీలించాలని సూచించారు. బ్రాహ్మణపల్లి వద్ద తనను ఓ యువకుడు బెదిరించాడన్న ఫిర్యాదుపైనా పోలీసులు సీసీ కెమెరాల ఆధారంగా విచారణ జరిపారని, ఆరోపణలకు ఆధారాలు లేవని తేలిందని నేతలు తెలిపారు. వినాయక నిమజ్జనం సమయంలోనూ కొందరు యువకులపై ఫిర్యాదు చేశారని పేర్కొన్నారు. ఎన్నికల సమయంలో వివేకా హత్య కేసును తెరపైకి తెచ్చి వైఎస్ కుటుంబంపై ఆరోపణలు చేయడం తగదని స్పష్టం చేశారు. భద్రత అవసరమైతే అధికారులను ఆశ్రయించి నిబంధనల ప్రకారం కోరాలని సూచించారు.

# రూ.3 వేల మందులు.. రూ.27 వేల బిల్లు

### క్యాన్సర్ మందుల ధరలపై సుప్రీం ఆగ్రహం



క్యాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధులకు వాడే మందుల ధరల్లో భారీ వ్యత్యాసంపై సుప్రీంకోర్టు తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. రిటైలర్‌కు సుమారు రూ.3 వేలకు అందే అత్యవసర క్యాన్సర్ మందు వినియోగదారుడికి ఏకంగా రూ.27 వేలకు అమ్మడం ఏంటని జస్టిస్ విక్రమ్ నాథ్, జస్టిస్ సందీప్ మెహతాతో కూడిన ధర్మాసనం ప్రశ్నించింది. దాదాపు పది రెట్ల ధర పెంపుపై స్పందిస్తూ, ఈ రూ.24 వేల వ్యత్యాసం ఎక్కడికి వెళ్తోందో చెప్పాలని ప్రశ్నించింది. సామాన్యుడికి చికిత్స ఖర్చు భరించడం ఇప్పటికే కష్టంగా మారిన సమయంలో ఇలాంటి ధరల విధానం మరింత భారంగా మారుతుందని కోర్టు వ్యాఖ్యానించింది.

### 16 శాతం మార్జిన్ ఎందుకు కాదు?

అత్యవసర మందులపై రిటైలర్ మార్జిన్‌ను 16 శాతానికే పరిమితం చేసే విధానం అన్ని మందులకు వర్తింపజేయలేమా అని సుప్రీంకోర్టు కేంద్రాన్ని ప్రశ్నించింది. డ్రగ్స్ ప్రైసెస్ కంట్రోల్ ఆర్డర్ 2013లోని నిబంధనలను ప్రస్తావిస్తూ, ధరల నియంత్రణలో మరింత స్పష్టత అవసరమని పేర్కొంది. భారీ మార్జిన్ల వల్ల చివరకు నష్టపోయేది ప్రజలేనని, ముఖ్యంగా ప్రభుత్వ ఆరోగ్య పథకాల ద్వారా చికిత్స పొందుతున్నప్పుడు ఆ భారాన్ని పన్ను చెల్లింపుదారులే మోయాల్సి వస్తుందని ధర్మాసనం తెలిపింది.

### ప్రైవేట్ ఆసుపత్రులపై కీలక ప్రశ్న

ఈ భారీ ధరల పెంపుతో ఫార్మా కంపెనీల కంటే ప్రైవేట్ ఆసుపత్రులే ఎక్కువగా లాభపడుతున్నాయా? అని కోర్టు ప్రశ్నించింది. కేంద్రం తరఫున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా స్పందిస్తూ, ఫార్మా కంపెనీల కంటే ప్రైవేట్ ఆసుపత్రులే ప్రధాన లబ్ధిదారులని తెలిపారు. ఆసుపత్రుల్లోనే మందులు కొనాలని రోగులను ఒత్తిడి చేయడం వల్ల తక్కువ ధరకు బయట కొనుగోలు చేసే అవకాశం కూడా లేకుండా పోతోందని కోర్టు గుర్తించింది. చికిత్స కోసం కుటుంబాలు ఆస్తులు అమ్ముకునే పరిస్థితి రాకూడదని గత విచారణలోనూ ధర్మాసనం తీవ్రంగా వ్యాఖ్యానించింది.

### సామాన్యుడి ఆవేదనకు న్యాయస్థానం స్పందన

మందులు, వైద్య పరికరాలు, జనరిక్ ఔషధాలు అందుబాటు ధరల్లో లభించేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ దాఖలైన పిటిషన్లపై సుప్రీంకోర్టు విచారణ కొనసాగిస్తోంది. అత్యవసర మందుల ధరలపై కఠిన నియంత్రణ, అధిక లాభాలపై అడ్డుకట్ట, ధరల విధానంపై పారదర్శకత అవసరమని పిటిషనర్లు కోరుతున్నారు. కేంద్రం ప్రస్తుతం అమల్లో ఉన్న ధరల నియంత్రణ విధానాల వివరాలను కోర్టుకు సమర్పించేందుకు సమయం కోరింది. తదుపరి విచారణను అక్టోబర్ 12కు వాయిదా వేశారు. ఈ కేసులో సుప్రీంకోర్టు చేసిన వ్యాఖ్యలు ఖరీదైన వైద్యం భారాన్ని మోస్తున్న సామాన్య కుటుంబాల సమస్యను మరోసారి దేశం ముందుకు తెచ్చాయి.

# లెక్కలు రావడం లేదు

- ఏఐతో చిన్నారులకు తిప్పలు
- ఐనా డోంట్ కేర్, బెంగపడొద్దు
- ఎన్విడియా సీఈఓ రియాల్టీ చెక్

ఏఐ సాధనాలపై ఆధారపడటం వల్ల పిల్లలు ప్రాథమిక గణిత నైపుణ్యాలను మరిచిపోతున్నా పెద్దగా ఆందోళన అవసరం లేదని ఎన్విడియా సీఈఓ జెన్సన్ హువాంగ్ అభిప్రాయపడ్డారు. ది ఎజ్రా క్లెయిన్ షోలో మాట్లాడుతూ, ప్రస్తుతం పిల్లలు లాంగ్ డివిజన్, గుణకార పట్టికలు, స్క్వేర్ రూట్స్ వంటి ప్రాథమిక లెక్కలను మునుపటిలా సాధన చేయడం లేదన్నారు. చైనాలో 26 వేల మంది విద్యార్థులపై జరిగిన ఓ అధ్యయనంలో ఏఐతో హోంవర్క్ వేగంగా పూర్తయినా, ఆరు నెలల్లో పరీక్షల మార్కులు 20 శాతం వరకు తగ్గినట్లు నివేదికలు పేర్కొన్నాయని చర్చలో ప్రస్తావించారు. అయినా ఏఐ ఆధారిత భవిష్యత్తులో కొన్ని పాత నైపుణ్యాలు అంత ముఖ్యమైనవి కాకపోవచ్చని హువాంగ్ అన్నారు.



### కొత్త నైపుణ్యాలు పుట్టుకొస్తాయన్న హువాంగ్

పిల్లలు కొన్ని ప్రాథమిక నైపుణ్యాలను కోల్పోయినా, వాటి స్థానంలో మరింత ఉపయోగకరమైన కొత్త సామర్థ్యాలు అభివృద్ధి చెందవచ్చని హువాంగ్ అభిప్రాయపడ్డారు. సూక్ష్మమైన మేథో నైపుణ్యాలు కొంత తగ్గినా, పెద్ద వ్యవస్థలను అర్థం చేసుకునే 'సిస్టమ్ థింకింగ్' పెరగవచ్చని చెప్పారు. తన విషయాన్ని వివరిస్తూ తన ఇంటి చిరునామా, జిప్‌కోడ్, ఫోన్ నంబర్ కూడా తనకు గుర్తుండవని వ్యక్తిగత ఉదాహరణలు చెప్పారు. అవసరమైన సమాచారాన్ని ఇతరులు లేదా సాంకేతిక సాధనాలు అందిస్తున్నప్పుడు ప్రతి విషయం జ్ఞాపకం పెట్టుకోవాల్సిన అవసరం లేదన్నది ఆయన వాదన.

### ఏఐ ఆధారపడటంపై తీవ్ర చర్చ

అయితే హువాంగ్ వ్యాఖ్యలపై సోషల్ మీడియాలో తీవ్ర చర్చ మొదలైంది. పిల్లలు ప్రాథమిక గణితం నేర్చుకోకపోతే ఏఐ సాధనాలపై మరింత ఆధారపడే ప్రమాదం ఉందని కొందరు విమర్శించారు. సాంకేతిక సంస్థల ఉత్పత్తులపై ప్రజలను ఎక్కువగా ఆధారపడేలా చేస్తున్నారన్న ఆరోపణలు కూడా వచ్చాయి. ఏఐ వల్ల స్వతంత్ర ఆలోచన తగ్గుతుందా, వ్యక్తిగత నిర్ణయ సామర్థ్యం ప్రభావితమవుతుందా అన్న అంశాలపై ఇప్పటికే పలు అధ్యయనాలు జరుగుతున్నాయి. మరోవైపు ఏఐ కొత్త తరహా ఆలోచనా సామర్థ్యాలను పెంచగలదనే వాదన కూడా ఉంది. ప్రాథమిక నైపుణ్యాలను పూర్తిగా వదిలేయాలా, ఏఐతో కలిసి వాటిని ఉపయోగించాలా అన్న ప్రశ్న ఇప్పుడు విద్యారంగంలో కీలక చర్చగా మారుతోంది.

రాజ్య సంస్కరణ

బుధవారం, 30.9.2026, మేడ్చల్ మల్కాజిగిరి




## గుండె ఆరోగ్యంపై అవగాహన పెరగాలి

అమలాపురంలో వరల్డ్ హార్ట్ డే సందర్భంగా కిమ్స్ ఆస్పత్రి ఆధ్వర్యంలో గుండె ఆరోగ్యంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయం ఎదురుగా జరిగిన సభలో ఎమ్మెల్యే అయితా బత్తుల ఆనందరావు ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఆధునిక జీవనశైలి, ఒత్తిడి, ఆహారపు అలవాట్ల కారణంగా చిన్న వయసులోనే గుండె సమస్యలు పెరుగుతున్నాయని, ప్రతిఒక్కరూ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని సూచించారు. వైద్యులు, మెడికో విద్యార్థులు వృత్తిపరమైన ఒత్తిడిని ఎదుర్కొంటున్నందున వారికి విశ్రాంతి, రీఫ్రెష్ మెంట్ కార్యక్రమాలు అవసరమన్నారు. కిమ్స్ చైర్మన్ చైతన్యరాజు ప్రతిపాదించిన 'స్వచ్ఛ అమలాపురం'కు స్పందించిన ఎమ్మెల్యే అక్టోబర్ 10న 'స్వచ్ఛ కోకో బీచ్' కార్యక్రమం చేపట్టాలని సూచించారు. దీనికి చైర్మన్ అంగీకరించారు. అనంతరం ఆలయం నుంచి కిమ్స్ ఆస్పత్రి వరకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో వైద్యులు, విద్యార్థులు, సిబ్బంది, కూటమి నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.



## ఫకీరుపల్లె రహదారికి మహర్దశ

వేంపల్లె మండలం చింతలమడుగుపల్లె గ్రామంలోని ఫకీరుపల్లె ప్రధాన రహదారి సమస్యకు ఎట్టకేలకు పరిష్కారం లభించింది. ఆర్అండ్‌బీ నిధులు రూ.35 లక్షలతో చేపడుతున్న రహదారి నిర్మాణ పనులను స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ మహమ్మద్ షబ్బీర్ మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామస్తులు ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న రహదారి సమస్యను పులివెందుల నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి బీటెక్ రవి దృష్టికి తీసుకెళ్లగా, ఆయన చొరవతో రూ.35 లక్షల నిధులు మంజూరయ్యాయని తెలిపారు. నిధులు మంజూరు కావడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని, ప్రజలకు రాకపోకల్లో ఇబ్బందులు లేకుండా చూడాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. ఏళ్ల తరబడి నిరీక్షించిన రహదారి పనులు ప్రారంభం కావడంతో గ్రామస్తుల్లో హర్షం వ్యక్తమవుతోంది. కార్యక్రమంలో టీడీపీ నాయకులు లాడెన్, మదార్ తదితరులు పాల్గొన్నారు.

# ఎన్నికల సంఘంపై పోరుబాట

## దేశవ్యాప్త ఆందోళనకు ఇండియా కూటమి వ్యూహం




ఎన్నికల సంఘం వ్యవహారంపై ఇండియా కూటమి నేడు కీలక సమావేశం నిర్వహించనుంది. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ ను తొలగించాలని కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ తీర్మానం చేసిన నేపథ్యంలో తదుపరి కార్యాచరణపై చర్చించనున్నారు. దేశవ్యాప్తంగా నిరసనలు, బహిరంగ సభలు నిర్వహించడంతో పాటు పార్లమెంట్ లో అభిశంసన తీర్మానం ప్రవేశపెట్టే అంశంపై వ్యూహం ఖరారు చేయనున్నారు. ఢిల్లీలోని రాంలీలా మైదాన్ లో తొలి సభ నిర్వహించే అవకాశం ఉందని పార్టీ వర్గాలు తెలిపాయి. ఓటర్ల జాబితా సవరణలపై ఎన్నికల కమిషనర్ల మధ్య విభేదాలున్నాయన్న వార్తల నేపథ్యంలో రాహుల్ గాంధీ చేసిన విమర్శలు కూడా సమావేశంలో చర్చకు రానున్నాయి.

**పలు పార్టీల నేతల హాజరు**

కాంగ్రెస్ తరఫున మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీ, సోనియా గాంధీ పాల్గొననున్నారు.
తృణమూల్ కాంగ్రెస్, వామపక్షాలు, జేఎంఎం, ఆర్జేడీ, ఎన్సీపీ, నేషనల్ కాన్ఫరెన్స్, పీడీపీ నేతలు హాజరవుతారు. ఉద్ధవ్ ఠాక్రే వర్చువల్ గా పాల్గొననున్నారు. ఆప్ సమావేశానికి రాకపోయినా అభిశంసనకు మద్దతు ప్రకటించింది. డీఎంకే కూడా సమస్యకు మద్దతు తెలిపింది. సమాజ్ వాదీ పార్టీ తరఫున హరేంద్ర మాలిక్ హాజరవుతారు. అఖిలేశ్ యాదవ్ రాజ్యసభ నామినేషన్ పనుల్లో బిజీగా ఉన్నారని పార్టీ వర్గాలు తెలిపాయి. కపిల్ సిబల్ కు ఆహ్వానం అందింది. కూటమిని విస్తరించాలన్న సీపీఎం ప్రతిపాదనకు బీజేడీ, బీఆర్ ఎస్, వైఎస్సార్ సీపీ నుంచి సానుకూల స్పందన రాలేదని వర్గాలు పేర్కొన్నాయి.



## ఎంవీఆర్ సేవలు నేటి తరానికి స్ఫూర్తి

ప్రొద్దుటూరులో మాజీ ఎమ్మెల్యే డాక్టర్ ఎం.వి. రవ ణారెడ్డి ఐదో వర్ధంతి సందర్భంగా మంగళవారం రాయలసీమ కాలేజ్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్‌ల ఘనంగా నివాళులర్పించారు. కళాశాల కరస్పాం డెంట్ మల్లెల ఉమ, ఆమె భర్త, ఎంవీఆర్ కుమారుడు మల్లెల మురళీధర్‌రెడ్డి ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎంవీ రమణారెడ్డి ప్రజా సేవక అంకితమై పనిచేసిన నాయకుడని, విద్యాభివృద్ధికి విశేషంగా కృషి చేశారని గుర్తుచేశారు. సమాజానికి ఆయన అందించిన సేవలు నేటి తరానికి స్ఫూర్తిగా నిలుస్తాయని పేర్కొన్నారు. అనంతరం మల్లెల ఉమ కళాశాల విద్యార్థినీ, విద్యార్థులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ గుమ్మ మయ్య, కళాశాల అధ్యాపకులు డాక్టర్ పి. భాస్కర్ రెడ్డి, డాక్టర్ ఏ. శంకర్‌రెడ్డి, డాక్టర్ రామసుబ్బారెడ్డి, డాక్టర్ పి. మధుసూదన్‌బాబు పాల్గొన్నారు.

## నీటమునిగిన పంటలకు తక్షణ పరిష్కారం కావాలి



అమలాపురం నియోజకవర్గం జనుపల్లిలో నీట మునిగిన పంట పొలాలను వైసీపీ నియోజకవర్గ కోఆర్డినేటర్ డాక్టర్ పినిపే శ్రీకాంత్ పరిశీలించారు. పొలాలు నీటిలో మునిగి తీవ్రంగా నష్టపోతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. సమస్య పరిష్కారం కోసం స్థానిక ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావును కలిసిన రైతులకు 'ఇవన్నీ కాటన్ దొర చేసిన తప్పులు' అని చెప్పడం ఎంతవరకు సమంజసమని శ్రీకాంత్ ప్రశ్నించారు. రైతులు నష్టాల్లో ఉన్న సమయంలో గత ప్రభుత్వాలపై నిందలు వేయడం కాకుండా తక్షణ పరిష్కారం చూపాల్సిన బాధ్యత ప్రస్తుత ప్రభుత్వంపై, ప్రజాప్రతినిధులపై ఉందని అన్నారు. రైతులతో నేరుగా మాట్లాడి పంటల పరిస్థితి, నీటిముంపు కారణంగా ఎదురవుతున్న ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. నీట మునిగిన పంటలకు నష్టం వాటిల్లకుండా, రైతులకు తక్షణ ఉపశమనం కల్పించే చర్యలు చేపట్టాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సమస్యను నిర్లక్ష్యం చేయకుండా అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి అవసరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా రైతు విభాగ అధ్యక్షుడు జిన్నూరి వెంకటేశ్వరరావు, గ్రామ కమిటీ అధ్యక్షులు శ్రీను, సూరిబాబు, రైతులు పాల్గొన్నారు.

## స్వచ్ఛథాన్ కు విజయవాడ సిద్ధం.. రన్నర్ల సందడి




విజయవాడఅమరావతి వేదికగా అక్టోబర్ 2న గాంధీ జయంతి సందర్భంగా హెచ్ డీఎఫ్ సీ బ్యాంక్ స్వచ్ఛథాన్2026 నిర్వహించనున్నారు. స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్, అమరావతి రన్నర్స్ సహకారంతో జరిగే ఈ కార్యక్రమానికి హెచ్ డీఎఫ్ సీ బ్యాంక్ టైటిల్ పార్ట్ నర్ గా వ్యవహరిస్తోంది. స్వచ్ఛత, బాధ్యతాయుత పౌరసత్వం, ప్లాస్టిక్ రహిత జీవనం, పర్యావరణ పరిరక్షణపై ప్రజల్లో అవగాహన కల్పించడమే లక్ష్యమని కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్ తెలిపారు. 5కె, 10కె, 21కె విభాగాల్లో జరిగే రన్ లో 13 రాష్ట్రాల నుంచి 10 వేల మందికిపైగా పాల్గొననున్నారు. రూ.10 లక్షల ప్రైజ్ మనీతో పాటు 10కె, 21కె రన్నర్లకు టైమింగ్ బిబ్స్ అందిస్తారు. ఉదయం 5 గంటలకు విజయవాడ ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియం నుంచి రన్ ప్రారంభమై కృష్ణా బ్యారేజ్, స్టీల్ బ్రిడ్జి మీదుగా అమరావతి ప్రాంతానికి చేరుతుంది. మంత్రి నారా లోకేష్ ప్రారంభించనున్న ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, సినీ, క్రీడా ప్రముఖులు పాల్గొననున్నారు. సీఎం చంద్రబాబు స్వచ్ఛథాన్ బనియన్లను ఆవిష్కరించారు.



## విద్యా సంస్కరణలకు సింగపూర్ భరోసా

### లోకేశ్ చర్యలకు షణ్ముగం ప్రశంసలు

ఏపీ విద్యా వ్యవస్థలో ప్రభుత్వం చేపడుతున్న సంస్కరణలను సింగపూర్ హోం, చట్టసభల మంత్రి కే. షణ్ముగం ప్రశంసించారు. మంగళవారం తిరుమలలో శ్రీవేంకటేశ్వరస్వామిని దర్శించుకున్న అనంతరం విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ తో ఆయన రాష్ట్ర అభివృద్ధి, విద్య, సామాజిక భద్రత, మాదకద్రవ్యాల నియంత్రణపై చర్చించారు. విద్యా రంగానికి ఇస్తున్న ప్రాధాన్యతను అభినందించిన షణ్ముగం, సింగపూర్ లో అమలవుతున్న ఉత్తమ విధానాలను ఏపీలో అమలు చేసేందుకు సహకరిస్తామని హామీ ఇచ్చారు. డ్రాపౌట్లు పెరగడం వల్ల యువత డ్రగ్స్ సహా పలు సామాజిక సమస్యలకు గురయ్యే అవకాశం ఉందని పేర్కొన్న ఆయన, పాఠశాలల్లో డ్రాపౌట్ రేటును సున్నాకు చేర్చేలా మరిన్ని చర్యలు తీసుకోవాలని సూచించారు.డ్రగ్స్ నియంత్రణ.. ఐటీఐలకు నైపుణ్య శిక్షణప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల చేరిక పెంచేందుకు తీసుకుంటున్న చర్యలను లోకేశ్ కు వివరించారు. ప్రభుత్వ పాఠశాలలను సందర్శించేందుకు షణ్ముగం ఆసక్తి వ్యక్తం చేశారు. డ్రగ్స్ నియంత్రణకు సింగపూర్ విధానాలను ఏపీలో అమలు చేసేందుకు సహకరిస్తామని తెలిపారు. సింగపూర్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ తో ఏపీ ఐటీఐలను అనుసంధానించి యువతకు ఉపాధి ఆధారిత నైపుణ్య శిక్షణ అందించే దిశగా ఇరు పక్షాలు నిర్ణయించాయి.

## చీరాల మోడల్ స్కూల్‌లో ఎస్ఎంసీ వివాదం



చీరాల ఏపీ మోడల్ స్కూల్‌లో మంగళవారం నిర్వహించిన పాఠశాల యాజమాన్య కమిటీ (ఎస్ఎంసీ) ఎన్నికలు వివాదాస్పదంగా మారాయి. ఎన్నికల ప్రక్రియను ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా నిర్వహించలేదని విద్యార్థుల తల్లిదండ్రులు ఆరోపించారు. నిబంధనల ప్రకారం మధ్యాహ్నం 2 నుంచి 3 గంటల వరకు ఎన్నికలు జరగాల్సి ఉండగా, తల్లిదండ్రులు పూర్తిస్థాయిలో హాజరయ్యేలోపే ఎన్నిక పూర్తయిందని సిబ్బంది ప్రకటించారని వారు పేర్కొన్నారు. తమకు అనుకూలమైన వ్యక్తుల పేర్లను ముందుగానే రాసుకుని ఎంపిక చేశారంటూ కొందరు తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేశారు. పాఠశాలలో గతంలోనూ పలు ఆరోపణలు, వివాదాలు చోటుచేసుకున్నాయని వారు గుర్తుచేశారు. తాజా ఘటనపై జిల్లా కలెక్టర్, జిల్లా విద్యాశాఖాధికారులు సీసీటీవీ ఫుటేజ్‌ను పరిశీలించి సమగ్ర విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. ఎన్నికల సమయంలో ఎంతమంది తల్లిదండ్రులు హాజరయ్యారు, ఓటింగ్‌లో ఎవరు పాల్గొన్నారు, కోఆప్షన్ సభ్యుల అర్హతలు ఏమిటన్న అంశాలను పరిశీలించాలని కోరారు. ఎన్నికలపై అధికారిక వివరణ వెలువడాల్సి ఉంది.

## దేవాంగపురి పాఠశాలకు కొత్త కమిటీ



బాపట్ల జిల్లా చీరాల రూరల్ పరిధిలోని దేవాంగపురి శంకరయ్య మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో 2026-27 విద్యా సంవత్సరానికి నూతన పాఠశాల యాజమాన్య కమిటీ ఏర్పాటైంది. మంగళవారం పాఠశాల ప్రాంగణంలో ప్రధానోపాధ్యాయురాలు బోడావుల సుభాషిణి ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో తల్లిదండ్రులు, అభిభావకులు, ఉపాధ్యాయులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు. నిబంధనల ప్రకారం జరిగిన ఎన్నికల్లో పింజల శైలజ చైర్మన్ గా, బుద్ధి శంకర్ బాబు వైస్ చైర్మన్ గా ఎన్నికయ్యారు. మొత్తం 15 మంది సభ్యులతో కమిటీని ఏర్పాటు చేశారు.

## చేనేత మహిళల ఆదాయానికి ప్రభుత్వం ఆర్థిక చేయూత



బాపట్ల జిల్లా చీరాల-వేటపాలెం పరిధిలోని దేశాయిపేటలో చేనేత మహిళల జీవనోపాధి మెరుగుదలపై ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, జాతీయ గ్రామీణ జీవనోపాధుల మిషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో మిషన్ ప్రతినిధులు నీలెందు ముఖర్జీ, సీనియర్ అడ్వైజర్ డాక్టర్ ఎన్.వి.ఆర్. నాథన్, విజిటింగ్ ప్రొఫెసర్ గౌతమ్ మాజుందర్ పాల్గొన్నారు. పొదుపు సంఘాలకు చెందిన చేనేత మహిళలతో మాట్లాడి కుటుంబాల ఆర్థిక పరిస్థితి, వృత్తి సమస్యలు, మార్కెటింగ్ ఇబ్బందులపై వివరాలు సేకరించారు. చేనేత కుటుంబాలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి అవసరమైన సహకారం అందిస్తామని ప్రతినిధులు తెలిపారు. మెరుగైన మార్కెటింగ్ అవకాశాలు కల్పించి చేనేత కార్మికుల ఆదాయం పెంచేందుకు చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. కార్యక్రమంలో క్లస్టర్ హెడ్ హరిగోపాల్ దత్త, సాంకేతిక బృందం ప్రతినిధి అభిషేక్, ఏపీఎం అంజిబాబు, మధుబాబు, క్షేత్రస్థాయి కార్యనిర్వాహకురాలు పింజల శైలజ, మయూరి, చేనేత సంఘ ప్రతినిధులు సిద్ది బుచ్చేశ్వరరావు, బుసము శ్రీనివాసరావు, అధికారులు, మహిళా సంఘాల ప్రతినిధులు, చేనేత కార్మికులు పాల్గొన్నారు.



## స్థానిక ఎన్నికలపై ఎస్ఈసీ క్లారిటీ

### రెండు నెలల వాయిదా వార్తలు అవాస్తవం

ఆంధ్రప్రదేశ్ స్థానిక సంస్థల ఎన్నికలు మరో రెండు నెలలు ఆలస్యమవుతాయంటూ సోషల్ మీడియా, ఇతర వేదికల్లో జరుగుతున్న ప్రచారాన్ని రాష్ట్ర ఎన్నికల సంఘం (ఎస్ఈసీ) ఖండించింది. ఎన్నికల షెడ్యూల్ ప్రకటనకు మరో రెండు నెలలు పడుతుందంటూ వస్తున్న సమాచారం పూర్తిగా తప్పుడు, అనధికారికమని స్పష్టం చేసింది. ఓటర్ల జాబితాలు, రిజర్వేషన్లకు సంబంధించిన కేసుల కారణంగా ఎన్నికలు వాయిదా పడతాయంటూ ప్రచారం జరుగుతున్న నేపథ్యంలో ఎస్ఈసీ ఈ ప్రకటన చేసింది. ఎన్నికల ప్రక్రియకు సంబంధించిన అధికారిక సమాచారాన్ని తమ నుంచి జారీ చేయలేదని తెలిపింది. ప్రజలు, రాజకీయ పార్టీలు, ఇతర వర్గాలు ఇలాంటి సమాచారాన్ని నమ్మవద్దని, ప్రచారం చేయవద్దని సూచించింది.

**అధికారిక ప్రకటనలనే నమ్మాలి**

స్థానిక ఎన్నికల షెడ్యూల్ పై నిర్ణయం తీసుకున్నప్పుడు అధికారిక మీడియా సమావేశం లేదా అధికారిక పత్రికా ప్రకటన ద్వారానే సమాచారం వెల్లడిస్తామని ఎస్ఈసీ స్పష్టం చేసింది. తన పేరుతో తప్పుడు, తప్పుదోవ పట్టించే సమాచారాన్ని ప్రచారం చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకునే అవకాశం ఉందని హెచ్చరించింది. ఎన్నికలకు ముందు పూర్తి చేయాల్సిన చట్టపరమైన, న్యాయపరమైన ప్రక్రియలు కొనసాగుతున్నాయని తెలిపింది. పట్టణ స్థానిక సంస్థల ఎన్నికలను ముందుగా, గ్రామీణ స్థానిక సంస్థల ఎన్నికలను తరువాత నిర్వహించే అంశంపై పరిపాలనా స్థాయిలో పరిశీలన జరుగుతున్నట్లు సమాచారం. ఫైనాన్స్ కమిషన్ నిధులపై ప్రభావం పడకుండా ఎన్నికల ప్రక్రియను పూర్తి చేయడంపై దృష్టి ఉన్నట్లు తెలుస్తోంది. అయితే తుది షెడ్యూల్ మాత్రం ఎస్ఈసీ అధికారిక నోటిఫికేషన్ తర్వాతే స్పష్టమవుతుంది.

## సచివాలయ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



ప్రొద్దుటూరులో సచివాలయ ఉద్యోగుల న్యాయపరమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించి, సచివాలయ వ్యవస్థను బలోపేతం చేయాలని మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి డిమాండ్ చేశారు. దొరసానిపల్లెలోని తన నివాసంలో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గతంలో ఉద్యోగులతో ప్రభుత్వం చర్చలు జరిపినా సమస్యలకు పరిష్కారం లభించలేదన్నారు. మరోసారి చర్చలకు సిద్ధమైన ఉద్యోగులను అమరావతికి వెళ్లేందుకు అనుమతులు, సెలవులు ఇవ్వకపోవడం సరికాదని విమర్శించారు. అదనపు విధులు, ఇంటింటి సర్వే, ఆధార్ కేంద్రాల నిర్వహణతో పనిభారం పెంచుతున్న ప్రభుత్వం.. బకాయిలు, పే స్కేలు, అలవెన్సులు, మెటర్నిటీ లీవ్ సమస్యలపై దృష్టి పెట్టాలని కోరారు. ఉద్యోగులపై నమోదైన కేసులను పునఃపరిశీలించాలని, అనుచిత వ్యాఖ్యలపై ప్రభుత్వం క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించకపోతే ఉద్యోగులు ఆందోళనకు దిగే పరిస్థితి వస్తుందని, వారి న్యాయపరమైన డిమాండ్లకు వైఎస్సార్‌సీపీ మద్దతుగా ఉంటుందని రాచమల్లు స్పష్టం చేశారు.

## పరీక్షసరిగా రాయలేదని విద్యార్థిపై దాడి



ప్రొద్దుటూరులోని సంగమేశ్వర ప్రైవేట్ హైస్కూల్ లో ఆరవ తరగతి విద్యార్థి తమన్ పై ఓ ప్రైవేట్ టీచర్ దాడి చేసినట్లు తల్లిదండ్రులు ఆరోపించారు. పరీక్షలో ప్రశ్నకు సమాధానం రాయలేదన్న కారణంతో తమ కుమారుడిని టీచర్ కొట్టినట్లు వారు తెలిపారు. ఘటన విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు పాఠశాలకు వెళ్లి యాజమాన్యాన్ని వివరణ కోరినా, తమ ఫిర్యాదుపై సరైన స్పందన రాలేదని ఆరోపించారు. దీంతో వారు ప్రొద్దుటూరు రూరల్ పోలీస్ స్టేషన్ ను ఆశ్రయించి ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు ఆధారంగా పోలీసులు ఘటనపై విచారణ చేపట్టినట్లు సమాచారం. విద్యార్థిపై నిజంగా దాడి జరిగిందా? ఘటనకు దారితీసిన పరిస్థితులు ఏమిటి? అనే అంశాలపై విచారణ కొనసాగుతోంది. వాస్తవాలను పూర్తిస్థాయిలో నిర్ధారించి బాధ్యులపై తగిన చర్యలు తీసుకోవాలని విద్యార్థి తల్లిదండ్రులు కోరారు. ప్రైవేట్ పాఠశాలల్లో విద్యార్థుల భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా విద్యాశాఖ అధికారులు పర్యవేక్షణ పెంచాలని వారు విజ్ఞప్తి చేశారు.

## ప్రొద్దుటూరు సమస్యలపై ఎమ్మెల్యే గళం




కడప కలెక్టరేట్ లో మంగళవారం నిర్వహించిన జిల్లా సమీక్షా కమిటీ సమావేశంలో ప్రొద్దుటూరు ఎమ్మెల్యే నంద్యాల వరదరాజుల రెడ్డి నియోజకవర్గ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి ఆధ్వర్యంలో, జిల్లా ఇన్ చార్జి మంత్రి ఎస్ .సవిత అధ్యక్షతన సమావేశం జరిగింది. జిల్లాలో వివిధ శాఖల పనితీరు, అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాల అమలుపై శాఖల వారీగా సమీక్ష నిర్వహించారు. పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా జిల్లా పురోగతిని కలెక్టర్ వివరించారు. ఈ సందర్భంగా ప్రొద్దుటూరు నియోజకవర్గంలో మౌలిక వసతులు, సాగునీరు, తాగునీరు, రహదారులు, విద్య, వైద్యం తదితర అంశాలను ఎమ్మెల్యే ప్రస్తావించారు. ఇప్పటికే ప్రారంభమైన అభివృద్ధి పనులను వేగవంతం చేయడంతో పాటు పెండింగ్ సమస్యలను ప్రాధాన్యత క్రమంలో పరిష్కరించాలని కోరారు. సంక్షేమ పథకాల ప్రయోజనాలు అర్హులైన ప్రజలకు పూర్తిస్థాయిలో చేరేలా శాఖల మధ్య సమన్వయం అవసరమన్నారు. నియోజకవర్గ అభివృద్ధికి అవసరమైన ప్రతిపాదనలపై అధికారులు త్వరితగతిన చర్యలు తీసుకోవాలని సూచించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ నిధిమీనా, ఎమ్మెల్యేలు ఆదినారాయణరెడ్డి, సుధాకర్ యాదవ్, ఎమ్మెల్సీ రాంగోపాల్ రెడ్డి, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## తెలంగాణకు మహిళకు అరుదైన గౌరవం

### ఆస్ట్రేలియా స్ట్రాత్‌ఫీల్డ్ మేయర్‌గా సంధ్యారెడ్డి

ఆస్ట్రేలియాలో తెలంగాణకు చెందిన మహిళకు అరుదైన గౌరవం దక్కింది. సిడ్నీ నగరంలోని స్ట్రాత్‌ఫీల్డ్ పురపాలక సంఘం 73వ మేయర్‌గా కర్రి సంధ్యారెడ్డి (శాండీ రెడ్డి) ఎన్నికయ్యారు. ఇప్పటివరకు డిప్యూటీ మేయర్‌గా బాధ్యతలు నిర్వహించిన ఆమె తాజాగా మేయర్‌గా పదవీ బాధ్యతలు చేపట్టారు. 2028 సెప్టెంబర్ వరకు ఈ పదవిలో కొనసాగనున్నారు. హైదరాబాద్‌లో పుట్టి పెరిగిన సంధ్యారెడ్డి అనంతరం ఆస్ట్రేలియాకు వెళ్లి న్యాయవాదిగా స్థిరపడ్డారు. ఇమిగ్రేషన్ న్యాయవాదిగా పనిచేస్తూ స్ట్రాత్‌ఫీల్డ్ ప్రాంతంలో నివాసం ఉంటున్నారు. మేయర్‌గా ఎన్నిక కావడం ద్వారా స్థానిక పాలనలో కీలక బాధ్యతను చేపట్టారు.

**గౌరవంతో పాటు బాధ్యత**

మేయర్ పదవి దక్కడం పట్ల సంధ్యారెడ్డి స్పందిస్తూ స్థానిక కమ్యూనిటీకి సేవ చేసే అవకాశం లభించడం గౌరవంతో పాటు గొప్ప బాధ్యతగా భావిస్తున్నానని తెలిపారు. ప్రజల అవసరాలను తెలుసుకుని స్థానిక సంస్థ ద్వారా సేవలు మరింత మెరుగుపరిచే దిశగా పనిచేయనున్నట్లు చెప్పారు. హైదరాబాద్ ఖైరతాబాద్‌కు చెందిన ఆమె ఆస్ట్రేలియాలో స్థిరపడిన తర్వాత న్యాయవాదిగా తన వృత్తి జీవితాన్ని కొనసాగించారు. డిప్యూటీ మేయర్‌గా పనిచేసిన అనుభవంతో ఇప్పుడు మేయర్ బాధ్యతలు చేపట్టారు.





# కమలాన్ని కాదంటే

ఢిల్లీలో ఒక్క మాట ఇప్పుడు దేశ రాజకీయాల్లో ప్రకంపనలు రేపుతోంది. "మేం వెళ్లిపోయాక మీరు వస్తారు" అని మోదీ తనతో అన్నారని రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్య కేవలం రాజకీయ సభలో వినిపించిన మాటేనా? లేక రాబోయే రాజకీయ సమీకరణాలకు సంకేతమా? బీజేపీని ఓడించగల శక్తి కాంగ్రెస్‌కే ఉందని రాహుల్ బలంగా చెబుతున్న వేళ.. మరోవైపు ఉత్తరాదిలో బీజేపీ పట్టు ఇంకా గట్టిగానే ఉంది. దక్షిణాదిలో కాంగ్రెస్ బలపడుతున్నా.. ఢిల్లీ పీఠానికి దారి మాత్రం ఉత్తరాది రాష్ట్రాల మీదుగానే సాగాలి. ఇదే కాంగ్రెస్‌కు అసలు పరీక్ష. దీనికి తోడు ఓటర్ల జాబితా, ఎస్ఐఆర్, ఎన్నికల కమిషన్ వ్యవహారంపై కాంగ్రెస్ పోరాటాన్ని మరింత తీవ్రం చేసింది. ప్రధాన ఎన్నికల కమిషనర్ రాజీనామా నుంచి ప్రధాని రాజీనామా డిమాండ్ వరకు సీడబ్ల్యూసీ తీసుకున్న నిర్ణయాలు రాజకీయ వేడిని పెంచాయి. ఇక మమతా బెనర్జీ నేతృత్వంలోని టీఎంసీ సహా ప్రాంతీయ పార్టీల భవిష్యత్ పాత్ర ఏంటి? కాంగ్రెస్‌తో అవి కలిసి నడుస్తాయా? లేక తమ దారినే ఎంచుకుంటాయా? 2029కు ముందే దేశ రాజకీయాల్లో కొత్త ధ్రువీకరణకు తెరలేస్తోందా? రాహుల్ వ్యాఖ్యల వెనుక దాగి ఉన్న అసలు రాజకీయ వ్యూహమేంటి?

# కాంగ్రెస్‌దే హవా..!

## మోడీ అంగీకరించారన్న రాహుల్

## కొత్త కాంట్రవర్సీతో బీజేపీకి ట్రబుల్





దేశ రాజకీయాల్లో మరోసారి కాంగ్రెస్ వర్సెస్ బీజేపీ పోరు కేంద్రబిందువుగా మారింది. కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సమావేశంలో లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలు ఈ చర్చకు మరింత పదును పెట్టాయి. బీజేపీని ఓడించే శక్తి కాంగ్రెస్‌కు మాత్రమే ఉందని రాహుల్ గాంధీ స్పష్టం చేశారు. అంతటితో ఆగకుండా ప్రధాని నరేంద్ర మోదీతో జరిగిన ఒక అంతర్గత సమావేశాన్ని ప్రస్తావిస్తూ, "మేం వెళ్లిపోయిన తర్వాత మీరు వస్తారు" అని మోదీ తనతో చెప్పినట్లు రాహుల్ వెల్లడించారు. అయితే ఈ వ్యాఖ్యకు మోదీ నుంచి ఇప్పటివరకు బహిరంగ ధృవీకరణ వచ్చినట్లు సమాచారం లేదు. రాహుల్ చెప్పిన ప్రకారం, ఒక ఎంపిక కమిటీ సమావేశంలో తాను కొన్ని నిర్ణయాలపై అభ్యంతరం వ్యక్తం చేయగా, గత ప్రధానులు ఇందిరాగాంధీ వంటి వారు కూడా ఇలాంటి సందర్భాల్లో ఇలాగే వ్యవహరించేవారని మోదీ చెప్పారట. దానికి రాహుల్ స్పందిస్తూ, ఇందిరాగాంధీ తర్వాత జరిగిన ఎన్నికల్లో ఓడిపోయారని గుర్తుచేశానని చెప్పారు. ఈ సందర్భంగా పార్టీ నేతలు తనపై విశ్వాసం పెట్టుకోవాలని రాహుల్ కోరారు. ఇది కేవలం పార్టీ కార్యకర్తల్లో ఉత్సాహం నింపే వ్యాఖ్యేనా? లేక 2029 రాజకీయ పోరుకు కాంగ్రెస్ తనను తాను ప్రధాన ప్రత్యామ్నాయంగా నిలబెట్టుకునే ప్రయత్నమా? అన్న ప్రశ్న ఇప్పుడు ఢిల్లీ రాజకీయ వర్గాల్లో చర్చకు వచ్చింది. రాహుల్ గతంలోనూ బీజేపీని ఎదుర్కొనే జాతీయ శక్తి కాంగ్రెస్ మాత్రమేనని బహిరంగంగా చెప్పారు. 2026లో కూడా ఆయన ఇదే వాదనను మరింత బలంగా ముందుకు తీసుకెళ్లారు.

### • 'ఓటు చోరీ'తో కాంగ్రెస్ పోరాటం తీవ్రం

రాహుల్ గాంధీ తాజా వ్యాఖ్యల వెనుక మరో కీలక అంశం ఉంది. అదే 'ఓటు చోరీ' ఆరోపణలపై కాంగ్రెస్ సాగిస్తున్న రాజకీయ పోరాటం. ఈ అంశాన్ని మొదట ప్రస్తావించిన సమయంలో ప్రజల్లో కేవలం 20 శాతం మంది మాత్రమే దీనిని నమ్మారని, ఇప్పుడు 80 శాతానికి పైగా ప్రజలు దీనిపై విశ్వాసం వ్యక్తం చేస్తున్నారని రాహుల్ సమావేశంలో చెప్పినట్లు కాంగ్రెస్ వర్గాలు వెల్లడించాయి. ఈ అంశాన్ని మరింత బలంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఆయన పార్టీ నేతలకు సూచించారు. కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సమావేశం ఈ వివాదాన్ని పార్టీ ప్రధాన రాజకీయ అంశంగా స్వీకరించింది. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ తొలగింపు, ఎస్ఐఆర్ ప్రక్రియ తక్షణ నిలిపివేత, తొలగించిన ఓటర్ల పేర్ల పునరుద్ధరణ వంటి డిమాండ్లను కాంగ్రెస్ ముందుకు తెచ్చింది. ఎస్ఐఆర్ తర్వాత 13 కోట్లకు పైగా ఓటర్ల పేర్లు తొలగించబడ్డాయని కాంగ్రెస్ ఆరోపిస్తోంది. ఈ ఆరోపణను బీజేపీ తిరస్కరిస్తోంది. మృతుల పేర్లు, డూప్లికేట్ పేర్లు తొలగించడం వంటి చర్యలు ఓటర్ల జాబితా శుద్ధిలో భాగమేనని బీజేపీ నేతలు చెబుతున్నారు. అందువల్ల అసలు వివాదం కేవలం ఓటర్ల సంఖ్యపై కాదు.. ఎవరి పేరు ఎందుకు తొలగించారు, దానికి ఎలాంటి పారదర్శక విధానం ఉంది, అభ్యంతరం చెప్పే అవకాశం ఎంతవరకు కల్పించారు అన్న అంశాలపై కూడా ఉంది. కాంగ్రెస్ ఈ ప్రశ్నలను పార్లమెంట్, న్యాయస్థానాలు, ప్రజా ఉద్యమాల ద్వారా ముందుకు తీసుకెళ్లాలని నిర్ణయించినట్లు ప్రకటించింది.

### • ఉత్తరాదిలో బీజేపీ బలం.. కాంగ్రెస్‌కు అసలు సవాల్

ఇక్కడే కాంగ్రెస్ ముందున్న అసలు రాజకీయ సవాలు కనిపిస్తోంది. రాహుల్ గాంధీ జాతీయ స్థాయిలో కాంగ్రెస్ ఒక్కటే బీజేపీని ఓడించగలదని చెబుతున్నా, ఉత్తర భారత రాజకీయ భౌగోళికత కాంగ్రెస్‌కు ఇంకా కఠినమైన పరీక్షగానే ఉంది. ఉత్తరప్రదేశ్, బీహార్, రాజస్థాన్, మధ్యప్రదేశ్, గుజరాత్, హర్యానా వంటి రాష్ట్రాల్లో బీజేపీకి ఉన్న సంస్థాగత బలం, ఓటు ఆధారం, కేడర్ వ్యవస్థ కాంగ్రెస్‌కు పెద్ద సవాలు. అదే సమయంలో కాంగ్రెస్‌కు దక్షిణ భారతదేశంలోని కొన్ని రాష్ట్రాల్లో బలమైన రాజకీయ స్థానం ఉంది. కర్ణాటక, తెలంగాణ వంటి రాష్ట్రాల్లో కాంగ్రెస్ అధికారంలో ఉండటం దాని సంస్థాగత పునర్నిర్మాణానికి కొంత బలం ఇస్తోంది. కేరళలో కూడా 2026 ఎన్నికల తర్వాత కాంగ్రెస్ నేతృత్వంలోని కూటమి అధికారంలోకి వచ్చిన పరిణామం పార్టీకి రాజకీయ ఉత్సాహం ఇచ్చింది. అయితే దక్షిణాదిలో బలం మాత్రమే సరిపోదు.. ఆంధ్రప్రదేశ్‌లో ఇప్పుడు హస్తం పార్టీ ఉనికి లేదు. ఢిల్లీలో అధికారాన్ని సాధించాలంటే ఉత్తరాదిలో గణనీయమైన సీట్లు అవసరం. అందుకే కాంగ్రెస్ ముందున్న ప్రధాన ప్రశ్న ఉత్తరప్రదేశ్ వంటి భారీ రాష్ట్రాల్లో తన పునాదిని ఎంతవరకు బలోపేతం చేసుకోగలదన్నదే. 2024 లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ కొన్ని రాష్ట్రాల్లో పుంజుకున్నప్పటికీ.. దేశవ్యాప్తంగా బీజేపీకి ప్రత్యామ్నాయంగా నిలవాలంటే రాష్ట్రాల వారీగా ప్రత్యేక వ్యూహం అవసరం. రాహుల్ గాంధీ ఇప్పటికే పార్టీ జిల్లా స్థాయి సంస్థలను బలోపేతం చేయడం, స్థానిక నాయకత్వానికి ఎక్కువ బాధ్యత ఇవ్వడం వంటి అంశాలపై దృష్టి పెట్టారు. అందువల్ల "కాంగ్రెస్ మాత్రమే ప్రత్యామ్నాయం" అనే నినాదం కంటే "ప్రతి రాష్ట్రంలో కాంగ్రెస్ ఎంత బలపడుతుంది?" అన్న ప్రశ్నే 2029 దిశను నిర్ణయించగల కీలక అంశం.

### • మమతతో సంబంధాలు.. బెంగాల్‌లో కొత్త సమీకరణమా?

ఇక పశ్చిమ బెంగాల్ రాజకీయాలు కాంగ్రెస్ వ్యూహానికి మరో పరీక్షగా మారుతున్నాయి. మమతా బెనర్జీ నేతృత్వంలోని తృణమూల్ కాంగ్రెస్ ప్రస్తుతం బెంగాల్‌లో స్వతంత్ర రాజకీయ శక్తిగా కొనసాగుతోంది. కాంగ్రెస్ జాతీయ స్థాయిలో బీజేపీకి ప్రత్యామ్నాయంగా ఎదగాలని చూస్తున్న సమయంలో, బెంగాల్‌లో మాత్రం కాంగ్రెస్‌టీఎంసీ సంబంధాలు సంక్లిష్టంగానే ఉన్నాయి. మమతా బెనర్జీ పార్టీని కాంగ్రెస్‌లో విలీనం చేసే పరిస్థితి వస్తుందా? అన్న ప్రశ్నకు ప్రస్తుతం ఎలాంటి అధికారిక సంకేతం లేదు. అలాంటి విలీనం గురించి టీఎంసీ నుంచి అధికారిక ప్రతిపాదన వెలువడినట్లు కూడా సమాచారం లేదు. కాబట్టి దీనిని ప్రస్తుత రాజకీయ వాస్తవంగా చూడటం కంటే భవిష్యత్ రాజకీయ చర్చగా మాత్రమే చూడాలి. అయితే రాజకీయ సమీకరణాలు మారే పరిస్థితుల్లో మిత్రపక్షాల మధ్య సంబంధాలు కూడా మారవచ్చు. 2026 ఎన్నికల సమయంలో రాహుల్ గాంధీ బెంగాల్‌లో టీఎంసీపై తీవ్ర విమర్శలు చేశారు. బీజేపీకి అక్కడ స్థలం కల్పించడానికి టీఎంసీ పాలన కారణమైందని ఆయన ఆరోపించారు. టీఎంసీ ఈ రాజకీయ వాదనను అంగీకరించలేదు. మరోవైపు జాతీయ స్థాయిలో బీజేపీకి వ్యతిరేకంగా విపక్ష ఐక్యత అవసరమనే వాదన కొనసాగుతోంది. ఇక్కడే కాంగ్రెస్‌కు ఒక వ్యూహాత్మక చిక్కు ఉంది. ప్రాంతీయ పార్టీలను బలహీనపరచి కాంగ్రెస్ ఎదగాలా? లేక వాటితో సీట్ల సర్దుబాటు చేసుకుని బీజేపీకి వ్యతిరేక ఓట్లను సమీకరించాలా? ఈ రెండు మార్గాల్లో ఏది అనుసరించాలన్నది ప్రతి రాష్ట్రంలోని రాజకీయ పరిస్థితులపై ఆధారపడి ఉంటుంది. బెంగాల్ విషయంలో కాంగ్రెస్ స్వతంత్ర విస్తరణకు ప్రయత్నిస్తే టీఎంసీతో ఘర్షణ పెరగవచ్చు. సహకారం కోరితే స్థానికంగా కాంగ్రెస్ ఎదుగుదలకు పరిమితులు ఏర్పడే అవకాశం ఉంటుంది.

### • ప్రాంతీయ పార్టీల విలీనం.. నిజంగానే సాధ్యమేనా?

రాహుల్ గాంధీ వ్యాఖ్యల నేపథ్యంలో మరో పెద్ద ప్రశ్న ఇప్పుడు ముందుకు వస్తోంది. దేశంలోని ప్రాంతీయ పార్టీలు భవిష్యత్‌లో కాంగ్రెస్‌తో విలీనం అయ్యే పరిస్థితి వస్తుందా? ప్రస్తుతం అలాంటి విస్తృత రాజకీయ ప్రక్రియ ప్రారంభమైందని చెప్పడానికి ఆధారాలు లేవు. భారత రాజకీయ వ్యవస్థలో ప్రాంతీయ పార్టీలకు తమ తమ రాష్ట్రాల్లో ప్రత్యేక ఓటు బ్యాంకులు, నాయకత్వ నిర్మాణాలు, రాజకీయ ప్రయోజనాలు ఉన్నాయి. టీఎంసీ, సమాజ్‌వాదీ పార్టీ, ఆర్జేడీ, వంటి పార్టీలకు తమ రాష్ట్రాల్లో ప్రత్యేక రాజకీయ స్థానం ఉంది. అందువల్ల అవన్నీ ఒకేసారి కాంగ్రెస్‌లో విలీనం కావడం సులభమైన ప్రక్రియ కాదు. విలీనం కంటే కూటమి, సీట్ల సర్దుబాటు, ఎన్నికల సమన్వయం వంటి మార్గాలే రాజకీయంగా ఎక్కువగా కనిపించే అవకాశాలు ఉన్నాయి. 2026లోనే ప్రతిపక్ష కూటమిలో విభేదాలు బయట పడ్డాయి. తమిళ నాడులో కాంగ్రెస్‌డీఎంకే సంబంధాల్లో మార్పుల చర్చ, బెంగాల్‌లో కాంగ్రెస్‌టీఎంసీ మధ్య పోటీ, ఉత్తరప్ర దేశ్‌లో కాంగ్రెస్ సమా జ్‌వాదీ పార్టీ మధ్య స్థానిక రాజకీయ లెక్కలు వంటి అంశాలు విపక్ష శిబిరం ఏకత్వానికి సవాళ్లు చూపించాయి. హిందుస్తాన్ టైమ్స్ విశ్లేషణ కూడా 2026లో ప్రతిపక్ష శిబి రంలో విభేదాలు ఉన్నప్పటికీ దానిని తుది విభ జనగా కా కుండా రాజ కీయ పున ర్వ్యవ స్థీ కరణ గా చూ డాల్సిన పరిస్థితి ఉందని పేర్కొంది. అందువల్ల రాహుల్ గాంధీ "కాంగ్రెస్ మాత్రమే బీజేపీని ఓడించగలదు" అనే వాదనను ముందుకు తీసుకెళ్తున్న సమయంలో ప్రాంతీయ పార్టీల భవిష్యత్ పాత్ర మరింత కీలకం కానుంది. కాంగ్రెస్ వాటిని తన ఆధీనంలోకి తీసుకురావాలని ప్రయత్నిస్తే ప్రతిఘటన రావచ్చు. వాటిని సమాన భాగస్వాములుగా తీసుకుంటే జాతీయ స్థాయిలో విస్తృత కూటమికి అవకాశం ఉంటుంది.

### • 2029 దిశగా అసలు పోరు.. కాంగ్రెస్ ముందు మూడు పరీక్షలు

ఇక మొత్తం పరిణామాలను కలిపి చూస్తే దేశ రాజకీయాల్లో వెంటనే అధికార మార్పు జరుగుతుందని చెప్పడానికి ఆధారం లేదు. అదే సమయంలో కాంగ్రెస్ బలహీనంగా ఉందని తేల్చేయడం కూడా సరైన రాజకీయ అంచనా కాదు. రాహుల్ గాంధీ ప్రస్తుతం కాంగ్రెస్‌ను కేవలం మరో ప్రతిపక్ష పార్టీగా కాకుండా బీజేపీకి ప్రధాన జాతీయ ప్రత్యామ్నాయంగా నిలబెట్టే ప్రయత్నం చేస్తున్నారు. దీనికి మూడు ప్రధాన పరీక్షలు ఎదురుగా ఉన్నాయి. మొదటిది ఉత్తరాదిలో పార్టీ ఓటు శాతాన్ని పెంచడం. రెండోది దక్షిణాదిలో ఉన్న బలాన్ని స్థిరమైన సీట్లుగా మార్చుకోవడం. మూడోది ప్రాంతీయ పార్టీలతో సంబంధాలను ఎలా నిర్వహించాలన్నది. దీనికి తోడు ఎన్నికల వ్యవస్థపై కొనసాగుతున్న వివాదం కాంగ్రెస్ రాజకీయ ప్రచారానికి మరో కేంద్ర అంశంగా మారింది. తాజాగా జరిగిన సీడబ్ల్యూసీ సమావేశంలో కాంగ్రెస్ ఈసీపై తన పోరాటాన్ని మరింత తీవ్రం చేయాలని నిర్ణయించింది. సెప్టెంబర్ 30న ఇండియా కూటమి సమావేశం తర్వాత తదుపరి కార్యాచరణపై స్పష్టత వచ్చే అవకాశం ఉంది. టీఎంసీ కూడా ఈసీతో జరిగిన సమావేశాలకు సంబంధించిన ఆడియో రికార్డులను విడుదల చేసే అంశాన్ని పరిశీలిస్తున్నట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. మరోవైపు బీజేపీ కాంగ్రెస్ ఆరోపణలను తిరస్కరిస్తూ, ఎన్నికల ఓటమిపై ఆత్మపరిశీలన చేయకుండా ఈసీని లక్ష్యంగా చేసుకుంటోందని విమర్శిస్తోంది. సుప్రీంకోర్టు కూడా ఈసీ నిర్ణయాలపై దాఖలైన పిటిషన్‌ను తదుపరి విచారణకు స్వీకరించేందుకు అంగీకరించింది. కాబట్టి ప్రస్తుతం దేశ రాజకీయాల్లో జరుగుతున్నది బీజేపీ వెంటనే ఇబ్బందుల్లో పడిందనే తుది సంకేతం కాదు.. కాంగ్రెస్ వెంటనే అధికారంలోకి వస్తుందనే హామీ కూడా కాదు. అసలు పోరు ఇప్పుడు సంస్థాగత బలం, ఓటు సమీకరణం, రాష్ట్రాల వారీ వ్యూహం, విపక్ష ఐక్యత, ఎన్నికల వ్యవస్థపై ప్రజల విశ్వాసం చుట్టూ తిరుగుతోంది. ఈ ఐదు అంశాల్లో కాంగ్రెస్ ఎంత దూరం ముందుకు వెళ్తుందో 2029 రాజకీయ పోరులో దాని స్థానం నిర్ణయించగలదు.

- జైశ్రీరామ కంటే శివనామం బెటర్
- బీజేపీకి రేవంత్ కౌంటర్
- కాక రేపిన కామెంట్.. కాషాయ దళం సైలెంట్



# శివరామ సంవాదం..

# రాజుకున్న వివాదం





**తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మరోసారి జాతీయ రాజకీయ వేదికపై సంచలన వ్యాఖ్యలతో చర్చకు కేంద్రంగా మారారు. సాధారణంగా రాష్ట్ర రాజకీయాలకే పరిమితమయ్యే అంశాలను ఢిల్లీ వేదికగా జాతీయ రాజకీయాలతో ముడిపెట్టడం ఆయన శైలిలో కనిపిస్తోంది. ఈసారి రాముడు–శివుడి ప్రతీకలను ముందుకు తెచ్చి బీజేపీ రాజకీయాలను ప్రశ్నించడం కొత్త వివాదానికి తెరతీసింది. "జై శ్రీరామ్" నినాదాన్ని బీజేపీ ఎక్కువగా వినియోగిస్తోందని ప్రశ్నించిన రేవంత్.. "హర హర మహాదేవ్" నినాదాన్ని ఎందుకు అదే స్థాయిలో ప్రస్తావించరని అడిగారు. తాము ద్రావిడులమని, శివుడిని ఆరాధిస్తామని, ఉత్తర భారత రాజకీయ సంస్కృతిలో రాముడి ప్రతీక బలంగా ఉందని ఆయన వ్యాఖ్యానించారు. అంతటితో ఆగకుండా శివుడిని పేదల దేవుడిగా, రాముడిని ధనికుల దేవుడిగా సామాజిక ప్రతీకల రూపంలో వివరించారు. బీజేపీ రాముడి పేరును రాజకీయంగా ఉపయోగించుకుంటోందన్నది ఆయన ప్రధాన వాదన. ఈ వ్యాఖ్యలే ఇప్పుడు అసలు చర్చకు కారణమయ్యాయి. రేవంత్ నిజంగా మతపరమైన పోలికను ఉద్దేశించారా? లేక బీజేపీ ఎన్నికల రాజకీయాన్ని టార్గెట్ చేయడానికి మత ప్రతీకలను రాజకీయ భాషలోకి తీసుకువచ్చారా? కాంగ్రెస్ మాత్రం రెండో అర్థాన్నే ముందుకు తెస్తోంది. పార్టీ తెలంగాణ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్.. రేవంత్ ఉద్దేశం దేవుళ్ల మధ్య తేడా చూపించడం కాదని, బీజేపీ రాముడి పేరును ఎన్నికల రాజకీయానికి ఉపయోగిస్తోందన్న విమర్శ చేయడమేనని స్పష్టం చేశారు. ఈ వివరణతో వివాదం చల్లారకపోగా, రాజకీయ వేడి మరింత పెరిగింది.**

## బీజేపీని నేరుగా టార్గెట్ చేసిన వ్యూహం

రేవంత్ వ్యాఖ్యల్లో కనిపిస్తున్న ప్రధాన అంశం బీజేపీ రాజకీయ భాషపై నేరుగా దాడి చేయడం. బీజేపీకి "జై శ్రీరామ్" ఒక ముఖ్యమైన రాజకీయ నినాదంగా మారిందన్న వాదనను ఆయన ముందుకు తెచ్చారు. అదే సమయంలో దక్షిణ భారత రాజకీయ, సాంస్కృతిక గుర్తింపును శివుడి ఆరాధనతో అనుసంధానించారు. "మేము శివ భక్తులం.. వాళ్లు రామ భక్తులు" అనే రీతిలో ఉత్తరం-దక్షిణం మధ్య రాజకీయ సంస్కృతుల తేడాను వివరించేందుకు ప్రయత్నించారు. ఇదే అంశాన్ని బీజేపీ తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. బండి సంజయ్ స్పందిస్తూ రాముడు-శివుడి మధ్య రాజకీయ గీతలు గీయడం సరికాదని విమర్శించారు. తెలంగాణలోనే వేములవాడను దక్షిణ కాశీగా, భద్రాచలాన్ని దక్షిణ అయోధ్యగా పేర్కొంటూ.. తెలంగాణ ముఖ్యమంత్రి రెండు దైవ సంప్రదాయాలను ప్రాంతాల వారీగా విభజించేలా మాట్లాడకూడదని అన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి కాశీ విశ్వనాథుడితో ఉన్న అనుబంధాన్ని కూడా బీజేపీ ప్రస్తావిస్తోంది. అంటే రేవంత్ ఒక ప్రశ్న వేస్తే.. బీజేపీ దానికి తెలంగాణలోని దేవాలయాలే సమాధానంగా చూపిస్తోంది. ఇక్కడే అసలు రాజకీయ పోరాటం కనిపిస్తోంది. రేవంత్ బీజేపీపై "రాముడి రాజకీయ వినియోగం" అనే ఆరోపణను ముందుకు తెస్తే.. బీజేపీ "హిందూ దేవతల మధ్య విభజన" అనే ఆరోపణను రేవంత్‌పై మోపుతోంది. ఒకే వ్యాఖ్యకు రెండు రాజకీయ కథనాలు తయారయ్యాయి. అందుకే ఈ వివాదం కేవలం మతపరమైన వ్యాఖ్యపై స్పందనగా కాకుండా, ఎవరు ఏ రాజకీయ ప్రతీకను ఎలా వినియోగించుకుంటారన్న పోరాటంగా మారుతోంది.

## • ఢిల్లీకి వెళ్లినప్పుడల్లా కొత్త సందేశమా?

ఇప్పుడు మరో ఆసక్తికరమైన ప్రశ్న తెరపైకి వస్తోంది. రేవంత్ ఢిల్లీ వెళ్లిన ప్రతిసారి రాష్ట్ర పరిమితులను దాటి జాతీయ రాజకీయాలపై దృష్టి పెట్టే వ్యాఖ్యలు ఎందుకు చేస్తున్నారు? ఇది యాదృచ్ఛికమా? లేక ఉద్దేశపూర్వక రాజకీయ కమ్యూనికేషన్‌నా? ఇటీవల ఢిల్లీలో ఆయన చేసిన వ్యాఖ్యలను వరుసగా పరిశీలిస్తే.. బీజేపీపై దాడి, సర్‌పై ఆరోపణలు, దక్షిణ రాష్ట్రాల రాజకీయ ప్రాతినిధ్యం, గాంధీ పరివార్-సంఘ్ పరివార్ పోరాటం వంటి అంశాలు ఒకదానికొకటి అనుసంధానమవుతున్నాయి. సర్ విషయంలో బీజేపీ ఎన్నికల లాభం కోసం ఓట్ల తొలగింపుకు ప్రయత్నిస్తోందని రేవంత్ ఆరోపించారు. అనంతరం "సర్ గో బ్యాక్" పేరుతో దేశవ్యాప్త ఉద్యమం అవసరమని ఢిల్లీలోనే పిలుపునిచ్చారు. మరో సందర్భంలో భారత రాజకీయ పోరాటం గాంధీ పరివార్, సంఘ్ పరివార్ మధ్య జరుగుతుందని వ్యాఖ్యానించారు. ఈ వ్యాఖ్యలపై బీజేపీ కూడా వెంటనే స్పందించింది. అంటే ఢిల్లీ వేదిక రేవంత్‌కు కేవలం కేంద్రాన్ని కలిసే పరిపాలనా స్థలం కాకుండా, జాతీయ మీడియా దృష్టిని ఆకర్షించే రాజకీయ వేదికగా కూడా మారుతున్నదన్న విశ్లేషణకు అవకాశం ఉంది. అయితే ప్రతి వ్యాఖ్య వెనుక ఒకే వ్యూహం ఉందని కచ్చితంగా చెప్పడానికి ప్రత్యక్ష ఆధారాలు లేవు. కానీ వరుసగా బీజేపీ, కేంద్రం, ఎన్నికల వ్యవస్థ, ఉత్తర-దక్షిణ రాజకీయ సమీకరణాలపై మాట్లాడటం మాత్రం స్పష్టమైన రాజకీయ దిశను సూచిస్తోంది. రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఉన్న రేవంత్.. జాతీయ రాజకీయ చర్చలో తన స్వరాన్ని బలంగా వినిపించాలనే ప్రయత్నం చేస్తున్నారన్నది ఈ పరిణామాల నుంచి గమనించాలి.

## • రాముడు-శివుడు పేరుతో కొత్త రాజకీయ రేఖ

ఈసారి రేవంత్ చేసిన వ్యాఖ్యల్లో మరో కీలక అంశం ఉత్తర-దక్షిణ రాజకీయ విభజన. "మేము ద్రావిడులం.. వాళ్లు ఆర్యులు" అన్న వ్యాఖ్యతో ఆయన సాంస్కృతిక గుర్తింపును రాజకీయ చర్చలోకి తీసుకువచ్చారు. దక్షిణ భారత రాష్ట్రాలు జనాభా ఆధారిత నియోజకవర్గాల పునర్విభజనలో తమ రాజకీయ బలం కోల్పోయే ప్రమాదం ఉందని కాంగ్రెస్ ఇప్పటికే ఆందోళన వ్యక్తం చేస్తోంది. సర్ అంశంపైనా దక్షిణ రాష్ట్రాల ఓటర్ల ప్రాతినిధ్యంపై రేవంత్ ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో రాముడు-శివుడు వ్యాఖ్యను విడిగా చూడాలా? లేక ఉత్తర-దక్షిణ రాజకీయ హక్కులపై ఆయన చేస్తున్న విస్తృత ప్రచారంలో భాగంగా చూడాలా? ఇదే ఇప్పుడు రాజకీయ వర్గాల్లో చర్చ. బీజేపీ మాత్రం ఈ వాదనను అంగీకరించడం లేదు. రాముడు ఉత్తరానికే, శివుడు దక్షిణానికే చెందిన దేవతలుగా చూపడం తప్పని బీజేపీ నేతలు చెబుతున్నారు. తెలంగాణలో భద్రాచలం, వేములవాడ వంటి ఆలయాలను ఉదాహరణగా చూపుతూ రెండు సంప్రదాయాలు రాష్ట్ర ప్రజల ఆధ్యాత్మిక జీవితంలో భాగమేనని గుర్తుచేస్తున్నారు. కాంగ్రెస్ వైపు నుంచి మాత్రం అసలు చర్చ దేవతల గురించి కాదని, రాజకీయంగా మతాన్ని ఉపయోగించే విధానంపై ప్రశ్న అని వివరణ వస్తోంది. దీంతో ఒకే వ్యాఖ్య చుట్టూ మతం, ప్రాంతీయత, ఎన్నికలు, సామాజిక వర్గాలు, రాజకీయ సిద్ధాంతాలు అన్నీ కలిసిపోయాయి. రేవంత్ వ్యాఖ్య దేశవ్యాప్తంగా చర్చకు రావడానికి ఇదే ప్రధాన కారణంగా కనిపిస్తోంది.

## • కొత్త వివాదాలే రేవంత్ రాజకీయ ఆయుధమా?

రేవంత్ రెడ్డి రాజకీయ శైలిని పరిశీలిస్తే.. ప్రత్యర్థిపై నేరుగా దాడి చేయడం, బలమైన పదజాలం ఉపయోగించడం, వెంటనే జాతీయ స్థాయిలో చర్చకు వచ్చే అంశాన్ని ఎంచుకోవడం వంటి లక్షణాలు తరచూ కనిపిస్తున్నాయి. బీఆర్ఎస్‌పై కూడా ఆయన ఇదే తరహా పదునైన రాజకీయ భాషను ఉపయోగించారు. ఇప్పుడు బీజేపీపై కూడా అదే దూకుడు కొనసాగుతోంది. సర్‌ను "సైమన్ గో బ్యాక్" తరహా ఉద్యమంతో పోల్చి దేశవ్యాప్త రాజకీయ పోరాటానికి పిలుపునిచ్చారు. బీజేపీ ఎన్నికల్లో గెలవడానికి ఓట్ల తొలగింపును ఉపయోగిస్తోందని ఆరోపించారు. ఇదే విధంగా రాముడు-శివుడు వ్యాఖ్య కూడా రేవంత్ రాజకీయ వాదనలో భాగం. అయితే రాజకీయ కమ్యూనికేషన్ కోణంలో చూస్తే.. ప్రతి వివాదం ఆయనకు ఒక పెద్ద వేదికను తెస్తోంది. బీజేపీ స్పందిస్తుంది. కాంగ్రెస్ వివరణ ఇస్తుంది. జాతీయ మీడియా చర్చిస్తుంది. సోషల్ మీడియాలో విస్తృత ప్రచారం జరుగుతుంది. దీంతో తెలంగాణ ముఖ్యమంత్రి వ్యాఖ్య రాష్ట్ర సరిహద్దులు దాటి జాతీయ రాజకీయ చర్చలోకి వెళ్తోంది. ఇది ఆయనకు ఉద్దేశపూర్వకంగా కావాలా? లేక ప్రత్యర్థుల ప్రతిస్పందన వల్ల సహజంగా జరుగుతోందా? దీనిపై కచ్చితమైన సమాధానం లేదు. కానీ రాజకీయ సందేశాన్ని చిన్న వాక్యంలో బలంగా చెప్పి.. దానిపై ప్రత్యర్థిని స్పందించేటట్లు చేయడం ద్వారా జాతీయ చర్చను సృష్టించే రాజకీయ కమ్యూనికేషన్ పద్ధతి మాత్రం ఈ పరిణామాల్లో కనిపిస్తోంది. అందుకే "కొత్త వివాదాలు కావాలనే తలకెత్తుకుంటున్నారా?" అనే ప్రశ్నకు రాజకీయ వర్గాల్లో ప్రాధాన్యం పెరుగుతోంది.

## • ఢిల్లీ పీఠమే అసలు లక్ష్యమా?

ఇక్కడే అసలు రాజకీయ ప్రశ్న మొదలవుతోంది. రేవంత్ రెడ్డి లక్ష్యం కేవలం తెలంగాణలో బీజేపీని ఎదుర్కోవడమేనా? లేక జాతీయ కాంగ్రెస్ రాజకీయాల్లో తన స్వరాన్ని మరింత బలంగా వినిపించడమా? ఢిల్లీలో వరుసగా జాతీయ అంశాలపై మాట్లాడటం, బీజేపీ కేంద్ర నాయకత్వాన్ని నేరుగా టార్గెట్ చేయడం, సర్‌పై దేశవ్యాప్త ఉద్యమానికి పిలుపునివ్వడం, దక్షిణ రాష్ట్రాల రాజకీయ ప్రాతినిధ్యాన్ని ప్రస్తావించడం, తాజాగా రాముడు-శివుడి పేర్లను జాతీయ రాజకీయాలతో అనుసంధానించడం చూస్తే.. ఆయన రాజకీయ పరిధిని తెలంగాణ దాటి విస్తరించాలనే ప్రయత్నం ఉన్నదా అనే చర్చకు అవకాశం ఉంది. అయితే దానిని "ప్రధాని పదవిపై లక్ష్యం"గా నిర్ధారించే ఆధారం ప్రస్తుతం లేదు. అదే సమయంలో రాహుల్ గాంధీని ప్రధానమంత్రి అభ్యర్థిగా ముందుకు తేవాలని రేవంత్ చేసిన పిలుపు మాత్రం జాతీయ రాజకీయాల్లో ఆయన తన స్థానాన్ని స్పష్టంగా నిర్వచించుకుంటున్నారనే సంకేతంగా చూడవచ్చు. అందుకే రాముడు-శివుడు వివాదాన్ని ఒకే వ్యాఖ్యగా ముగించలేం. ఇది బీజేపీపై కాంగ్రెస్ పోరాటంలో కొత్త ప్రతీకను ముందుకు తెచ్చిన ఘటనగా కనిపిస్తోంది. బీజేపీ దానికి మతపరమైన విభజన ఆరోపణతో ప్రతిస్పందిస్తోంది. రేవంత్ మాత్రం తన వ్యాఖ్య బీజేపీ రాజకీయ వినియోగంపై విమర్శేనని కాంగ్రెస్ ద్వారా వివరణ ఇప్పిస్తున్నారు. ఈ పోరాటం ఇక్కడితో ఆగుతుందా? లేక రాబోయే రోజుల్లో ఉత్తర-దక్షిణ రాజకీయాలు, సర్, నియోజకవర్గాల పునర్విభజన, కాంగ్రెస్ జాతీయ నాయకత్వం చుట్టూ మరింత పెద్ద చర్చకు దారితీస్తుందా? ఇప్పుడు దేశ రాజకీయ వర్గాల దృష్టి ఈ ప్రశ్నపైనే ఉంది. ఢిల్లీ వేదికపై రేవంత్ వేసిన ఈ రాజకీయ అడుగు.. ఆయన వ్యక్తిగత భవిష్యత్ లక్ష్యాన్ని నిర్ధారించకపోయినా, తెలంగాణ ముఖ్యమంత్రి జాతీయ రాజకీయ చర్చలో తన స్వరాన్ని మరింత బలంగా వినిపిస్తున్నారనే విషయాన్ని మాత్రం మరోసారి ముందుకు తెచ్చింది.

బెజవాడ రాజకీయాలకు చరిత్ర ఉంది. ఆ చరిత్రలో రక్తపు మరకలున్నాయి. వర్గాల మధ్య వైరం ఉంది. కుల సమీకరణాలున్నాయి. అధికార పోరాటాలున్నాయి. అదే సమయంలో సామాన్యుడి భుజం మీద చేయి వేసి ఎదిగిన నాయకత్వ కథ కూడా ఉంది. విజయవాడ రాజకీయ చరిత్రను వంగవీటి మోహన రంగా పేరును ప్రస్తావించకుండా చెప్పడం దాదాపు అసాధ్యం. **1980**లలో బెజవాడను కుదిపేసిన వంగవీటి–దేవినేని రాజకీయ ఘర్షణ కేవలం ఇద్దరు వ్యక్తుల మధ్య పోటీగా మిగలలేదు. అది అప్పటి విజయవాడ సామాజిక, రాజకీయ వాతావరణాన్ని ప్రభావితం చేసిన పరిణామంగా మారింది. రంగా **1985**లో కాంగ్రెస్ తరపున విజయవాడ తూర్పు నుంచి ఎమ్మెల్యేగా గెలిచారు. **1988 డిసెంబర్ 26**న ఆయన హత్యకు గురయ్యారు. ఆ ఘటన తర్వాత విజయవాడతో పాటు రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో తీవ్ర ఉద్రిక్తతలు చోటుచేసుకున్నాయి. రంగా మరణం తర్వాత ఆయన భార్య రత్నకుమారి రాజకీయాల్లోకి వచ్చి విజయవాడ తూర్పు నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహించారు. ఆ తర్వాత రంగా కుటుంబ వారసత్వాన్ని రాజకీయంగా మోసుకెళ్లిన వ్యక్తిగా కుమారుడు వంగవీటి రాధాకృష్ణ ఎదిగారు. ఇప్పుడు అదే కుటుంబం నుంచి మరో స్వరం వినిపిస్తోంది. ఆమె రంగా కుమార్తె వంగవీటి ఆశా కిరణ్. అందుకే ఇది కేవలం అన్నాచెల్లెళ్ల రాజకీయ ప్రయాణం కాదు. ఒకే కుటుంబం నుంచి వచ్చిన ఇద్దరు వారసులు మారుతున్న కాలాన్ని ఎలా అర్థం చేసుకుంటున్నారు? రంగా వారసత్వాన్ని రాజకీయంగా ఎవరు ఎలా నిర్వచించబోతున్నారు? అన్నదే అసలు ప్రశ్న. ఒకరు ఇప్పటికే ఎన్నికల రాజకీయాలను చూసిన అనుభవజ్ఞులు. మరొకరు ప్రజాజీవితంలోకి తాజాగా అడుగు పెట్టిన కొత్త ముఖం. ఒకరి ప్రయాణంలో పార్టీ మార్పులు కనిపిస్తే.. మరొకరి ప్రయాణంలో పార్టీకి ముందే వారసత్వాన్ని బలోపేతం చేసుకునే ప్రయత్నం కనిపిస్తోంది. అందుకే బెజవాడలో ఇప్పుడు చర్చ రంగా కుటుంబం గురించి మాత్రమే కాదు.. రంగా రాజకీయ వారసత్వానికి భవిష్యత్తు రూపం ఏమిటన్నదానిపైనా జరుగుతోంది.



# వారసుల మధ్య వార్

- హైకమాండ్ డైలమాతో సస్పెన్స్‌లో సీటు
- బెజవాడ జనం ఎవరికి వేస్తారు ఓటు..!







# రాధా, ఆశా రాజకీయాలు సెపరేటు

## రాధా రూట్.. పదవి కోసం వెయిట్

వంగవీటి రాధాకృష్ణ రాజకీయ ప్రస్థానాన్ని పరిశీలిస్తే ఒక విషయం స్పష్టంగా కనిపిస్తుంది. ఆయనకు తొలి రాజకీయ గుర్తింపు తండ్రి పేరుతో వచ్చినప్పటికీ, ఎన్నికల రాజకీయాల్లో తనకంటూ ఒక ముద్ర వేసుకునే అవకాశం 2004లో వచ్చింది. విజయవాడ తూర్పు నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసిన రాధా 2004 ఎన్నికల్లో గెలిచి తొలిసారి అసెంబ్లీలో అడుగుపెట్టారు. అధికారిక ఎన్నికల గణాంకాల ప్రకారం ఆయనకు 59,340 ఓట్లు, సమీప ప్రత్యర్థికి 32,629 ఓట్లు వచ్చాయి. అదే ఆయన ఎన్నికల రాజకీయాల్లో సాధించిన ఏకైక అసెంబ్లీ విజయం. ఆ తర్వాతి ప్రయాణం మాత్రం వరుసగా మారుతున్న రాజకీయ వేదికలతో సాగింది. ప్రజారాజ్యం పార్టీ ఏర్పడిన తర్వాత ఆయన ఆ పార్టీలో చేరి 2009 ఎన్నికల్లో పోటీ చేశారు. ఆ ఎన్నికల్లో ఆయన గెలవలేకపోయారు. అనంతరం వైఎస్సార్ కాంగ్రెస్‌లో చేరి 2014లో విజయవాడ తూర్పు నుంచి పోటీ చేసి ఓటమి ఎదుర్కొన్నారు. 2019 ఎన్నికలకు ముందు వైసీపీని వీడి టీడీపీ వైపు వెళ్లారు. ఆ సమయంలో విజయవాడ సెంట్రల్ టికెట్ విషయంలో విభేదాలు, మచిలీపట్నం లోక్‌సభ సీటుపై చర్చలు వంటి అంశాలు రాజకీయ వర్గాల్లో ప్రస్తావనకు వచ్చాయి. చివరకు 2019 ఎన్నికల్లో రాధా పోటీ చేయలేదు. 2024లో కూడా ఆయనకు ఎన్నికల టికెట్ రాలేదు. అయితే టీడీపీ తరపున రాష్ట్రవ్యాప్తంగా 44 నియోజకవర్గాల్లో ప్రచారం చేసినట్లు తాజా రాజకీయ కథనాలు పేర్కొంటున్నాయి. అంటే రాధా రాజకీయ ప్రయాణంలో ఒక విచిత్రమైన వైరుధ్యం కనిపిస్తోంది. ఎన్నికల్లో పోటీ చేసే అవకాశాలు తగ్గిన కొద్దీ పార్టీలో ఆయన ప్రచార ప్రాధాన్యం పెరిగింది. పదవి కోసం ఎదురు చూస్తున్న నాయకుడిగా ఆయన పేరు వినిపిస్తూనే ఉంది. 2024 తర్వాత కూడా ఎమ్మెల్సీ లేదా ఇతర పదవి వస్తుందనే చర్చలు కొనసాగాయి. 2026లోనూ ఎమ్మెల్సీ అవకాశం గురించి టీడీపీ వర్గాల్లో చర్చ జరుగుతోందని వార్తలు వచ్చాయి. అయితే రాజకీయాల్లో ప్రచారం ఒకటి, అధికారిక నిర్ణయం మరొకటి. హామీ ఒకటి, పదవి మరొకటి. అందుకే రాధా భవిష్యత్తును నిర్ణయించేది చివరకు పార్టీ నాయకత్వం తీసుకునే నిర్ణయమే.

## రంగా వారసత్వం.. రాధా రాజకీయ వ్యూహం

ఇక్కడే రంగా కుటుంబ రాజకీయాల్లో అసలు మలుపు మొదలవుతుంది. రాధా రాజకీయ ప్రయాణాన్ని చూసిన తర్వాత రంగా కుటుంబ వారసత్వం అంటే కేవలం ఒక నియోజకవర్గం, ఒక పార్టీ, ఒక ఎన్నిక అనే భావన సరిపోదని స్పష్టమవుతుంది. రంగా పేరు విజయవాడలో ఒక రాజకీయ జ్ఞాపకం మాత్రమే కాదు...ఒక సామాజిక గుర్తింపు. కానీ కాలం మారింది. 1980 నాటి బెజవాడలో ఉన్న రాజకీయ భాష, నేటి బెజవాడలో లేదు. అప్పట్లో నాయకుడి చుట్టూ వ్యక్తిగత అనుబంధాలు, వర్గ ప్రభావాలు, సామాజిక సమీకరణాలు బలంగా ఉండేవి. ఇప్పుడు పార్టీ వ్యవస్థలు, మీడియా, సామాజిక మాధ్యమాలు, స్థానిక సంస్థలు, సంక్షేమ రాజకీయాలు, యువత ఓటింగ్ ధోరణులు కూడా రాజకీయ భవిష్యత్తును ప్రభావితం చేస్తున్నాయి. అందువల్ల రంగా వారసుడిగా గుర్తింపు ఉండటం ఒక రాజకీయ మూలధనం కావచ్చు. కానీ అది ఎన్నికల విజయానికి స్వయంచాలక హామీ కాదు. రాధా అనుభవం కూడా ఇదే విషయాన్ని సూచిస్తుంది. తండ్రి పేరుతో ఏర్పడిన బలమైన భావోద్వేగాన్ని ఎన్నికల రాజకీయాల్లో నిలకడైన వ్యక్తిగత రాజకీయ బలంగా మార్చడం అంత సులభం కాలేదు. మూడు వేర్వేరు రాజకీయ వేదికలపై ఎన్నికల బరిలోకి దిగినా ఒక్కసారి మాత్రమే గెలిచారు. మరోవైపు ఆయన పార్టీ మార్పులను విమర్శించిన వారున్నారు...రాజకీయ పరిస్థితులకు అనుగుణంగా నిర్ణయాలు తీసుకున్నారని ఆయన అనుచరులు భావించే అవకాశం ఉంది. ఈ రెండు వ్యాఖ్యానాల మధ్య నిజమైన రాజకీయ అర్థాన్ని నిర్ణయించేది కాలమే. అయితే ఒక విషయం మాత్రం రాజకీయంగా ఆసక్తికరం. రాధా ఏ పార్టీలో ఉన్నా రంగా పేరు ఆయన రాజకీయ పరిచయంలో విడదీయరాని భాగంగానే ఉంది. 2019లో టీడీపీలో చేరిన తర్వాత కూడా ఆ గుర్తింపు కొనసాగింది. 2024లో టీడీపీ తరపున విస్తృత ప్రచారం చేయడం ద్వారా ఆయనకు పార్టీ పరంగా ఒక పాత్ర ఏర్పడింది. ఇప్పుడు ఆ పాత్రను పదవిగా మార్చుతారా? లేక ప్రచార నాయకుడిగానే కొనసాగిస్తారా? అన్నది టీడీపీ అధిష్ఠానం నిర్ణయించాల్సిన అంశం.

## ఆశా అరంగేట్రం.. రంగా వారసత్వంపై చర్చ

ఇదే సమయంలో ఆశా కిరణ్ రంగప్రవేశం రంగా కుటుంబ రాజకీయాలకు మరో కోణాన్ని తెచ్చింది. 2025 నవంబర్ 16న విజయవాడ రాఘవయ్య పార్క్ వద్ద తండ్రి విగ్రహానికి నివాళులర్పించిన ఆమె ఇకపై ప్రజల్లో ఉంటానని ప్రకటించారు. రంగా ఆశయాలను కొనసాగించడమే తన లక్ష్యమని, రాధా-రంగా మిత్రమండలిలోని విభేదాలను తగ్గించి ఐక్యత తీసుకురావాలనుకుంటున్నానని ఆమె చెప్పినట్లు పలు రకాల చర్చలు వాదనలు నివేదించాయి. ముఖ్యంగా ఆమె వెంటనే ఏదైనా రాజకీయ పార్టీలో చేరుతున్నట్లు ప్రకటించకపోవడం గమనించాల్సిన అంశం. అదే సమయంలో ఆమె రాజకీయ ప్రవేశాన్ని ప్రకటించడం మాత్రం సాధారణ సామాజిక కార్యక్రమంగా చూడలేని పరిణామం. ఎందుకంటే రంగా కుటుంబం నుంచి కొత్త రాజకీయ ముఖం వస్తే బెజవాడలో దానికి సహజంగానే రాజకీయ ప్రాధాన్యం ఏర్పడుతుంది. ఆమె ముందుగా పార్టీ కంటే ప్రజా సంబంధాలు, మిత్రమండలి, సామాజిక కార్యక్రమాలపై దృష్టి పెడితే అది ఒక భిన్నమైన రాజకీయ నిర్మాణానికి ప్రారంభం కావచ్చు. కానీ అది ఎన్నికల రాజకీయంగా మారుతుందా? ఏ పార్టీతో కలిసి పనిచేస్తుంది? విజయవాడలో ఏ నియోజకవర్గాన్ని లక్ష్యంగా చేసుకుంటుంది? అనే ప్రశ్నలకు ఇప్పటి వరకు ఖచ్చితమైన అధికారిక సమాధానం లేదు. 2026లో ఆమె విజయవాడలో వివిధ సామాజిక, సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొంటున్నట్లు స్థానిక కథనాలు వస్తున్నాయి. విజయవాడ నుంచి ఎన్నికల రాజకీయాల్లోకి రావచ్చనే ఊహాగానాలు కూడా ప్రచారంలో ఉన్నాయి. కానీ ఊహాగానాన్ని నిర్ణయంగా మార్చడం తొందరపాటు అవుతుంది. ఆమె స్వయంగా ఏ పార్టీని ఎంచుకుంటారో, ఏ స్థాయి ఎన్నికల్లో పోటీ చేస్తారో, రంగా వారసత్వాన్ని ఏ రాజకీయ కార్యక్రమంతో అనుసంధానిస్తారో తేలిన తర్వాతే ఆమె రాజకీయ ప్రస్థానంపై స్పష్టమైన అంచనా సాధ్యమవుతుంది.

## రాధా అనుభవం.. ఆశా సరికొత్త పయనం

అయితే రాధా-ఆశా కిరణ్ మధ్య తేడాను కేవలం అన్నాచెల్లెళ్ల వ్యక్తిగత పోటీగా చూడటం కూడా తప్పే. ఇద్దరి రాజకీయ కాలాలు వేరు. రాధా రాజకీయాల్లోకి వచ్చినప్పుడు రంగా మరణానికి దాదాపు పదిహేనేళ్లు మాత్రమే అయ్యాయి. రంగా హత్య జ్ఞాపకం అప్పటికీ రాజకీయంగా బలంగానే ఉంది. విజయవాడలో కుల, వర్గ సమీకరణాలు మరో రీతిలో పనిచేశాయి. ఇప్పుడు ఆశా కిరణ్ ప్రజల్లోకి వస్తున్నప్పుడు రంగా మరణానికి దాదాపు నాలుగు దశాబ్దాలు దాటాయి. కొత్త తరం రంగా గురించి తెలుసుకునే విధానం కుటుంబ జ్ఞాపకాల కంటే సామాజిక మాధ్యమాలు, సినిమాలు, రాజకీయ కథనాలు, పాత సంఘటనల పునర్వ్యాఖ్యానాలపై ఆధారపడే పరిస్థితి ఉంది. కాబట్టి ఆశా కిరణ్ ముందున్న సవాలు రంగా పేరును మళ్లీ వినిపించడం మాత్రమే కాదు...ఆ పేరుకు నేటి తరానికి సరిపోయే రాజకీయ అర్థం ఇవ్వడం. రంగా కులానికి మాత్రమే చెందిన నాయకుడు కాదని, కులమతాలకు అతీతంగా ప్రజల కోసం పనిచేశారని ఆమె తన తొలి రాజకీయ ప్రకటనలో చెప్పడం ఈ దిశలో ఒక సందేశంగా కనిపిస్తోంది. అదే ఆమె రాజకీయ బలంగా మారుతుందా? లేక రంగా కుటుంబానికి ఉన్న సంప్రదాయ సామాజిక గుర్తింపే ప్రధానంగా మిగులుతుందా? అన్నది భవిష్యత్తు నిర్ణయిస్తుంది. మరోవైపు రాధాకు ఉన్న బలం ఆయనకు ఉన్న ప్రత్యక్ష రాజకీయ అనుభవం. ఎన్నికలు చూశారు. ఓటములు చూశారు. పార్టీల మార్పులు చూశారు. అధికార పక్షం, ప్రతిపక్షం రెండింటి రాజకీయాలను చూశారు. 2024 తర్వాత అధికార కూటమి రాజకీయాల్లో కూడా పనిచేస్తున్నారు. అందువల్ల రాధా దగ్గర అనుభవం ఉంది. ఆశా కిరణ్ దగ్గర కొత్తదనం ఉంది. రాధా దగ్గర పార్టీ రాజకీయాల అనుభవం ఉంది. ఆశా కిరణ్ దగ్గర ఇంకా పార్టీకి అతీతంగా వారసత్వాన్ని నిర్మించుకునే అవకాశం ఉంది. ఈ రెండు మార్గాలు భవిష్యత్తులో ఒకదానికొకటి పోటీగా మారతాయా? లేక పరస్పరం అనుబంధ పూర్వకంగా ఉంటాయా? అన్నదే అసలు ఆసక్తికరమైన ప్రశ్న.

## బెజవాడ వారసత్వం.. రాజకీయ ప్రస్థానం

బెజవాడ రాజకీయాల్లో వంగవీటి కుటుంబానికి ఎదురుగా ఒకప్పుడు దేవినేని కుటుంబం అనే రాజకీయ ధ్రువం ఉండేది. ఆ కాలపు సంఘటనలను నేటి రాజకీయాలపై యథాతథంగా మోపడం మాత్రం సరికాదు. వంగవీటి-దేవినేని ఘర్షణకు చారిత్రక నేపథ్యం ఉన్నప్పటికీ, నేటి రాజకీయ పోరాటాలు పార్టీలు, అభివృద్ధి, సంక్షేమం, స్థానిక నాయకత్వం, సామాజిక సమీకరణాలు, వ్యక్తిగత రాజకీయ భవిష్యత్తు వంటి అనేక అంశాల చుట్టూ తిరుగుతున్నాయి. అయినప్పటికీ రంగా పేరు బెజవాడలో రాజకీయ స్మృతికి ఒక ముఖ్యమైన కేంద్రం కావడం మాత్రం మారలేదు. అందుకే ఏ పార్టీ అయినా రంగా కుటుంబానికి సంబంధించిన రాజకీయ కదలికలను పూర్తిగా విస్మరించలేని పరిస్థితి ఉంటుంది. రాధాను టీడీపీ తమ ప్రచార రాజకీయాల్లో ఉపయోగించుకుంది. 2024లో ఆయన రాష్ట్రవ్యాప్తంగా ప్రచారం చేయడం అందుకు ఉదాహరణ. అదే సమయంలో ఆశా కిరణ్ రాజకీయంగా చురుకవుతున్నారనే వార్తలు వస్తున్న నేపథ్యంలో వివిధ పార్టీలకు ఆమెపై ఆసక్తి ఉండటం సహజమే. అయితే ఆసక్తి, ఆహ్వానం, పొత్తు, పార్టీలో చేరిక, ఎన్నికల టికెట్...ఇవి అన్నీ వేర్వేరు దశలు. వాటిని ఒకటిగా చూడటం రాజకీయ విశ్లేషణను బలహీనపరుస్తుంది. అందుకే ఆశా కిరణ్‌ను ఇప్పుడే ఏదో ఒక పార్టీకి అనుసంధానించి చూడటం కంటే, ఆమె స్వయంగా నిర్మించుకునే రాజకీయ వేదికను గమనించడం సముచితం. ఇక్కడ మరో కీలక అంశం ఉంది. రంగా కుటుంబానికి రాజకీయ వారసత్వం ఉంది. కానీ వారసత్వం అనేది వారసత్వ హక్కు కాదు. ఎన్నికల్లో ప్రజలు ఓటు వేయాలి. ప్రజలు ఇచ్చే తీర్పు కుటుంబ చరిత్రను గౌరవించవచ్చు, తిరస్కరించవచ్చు, కొత్త అర్థం ఇవ్వవచ్చు. రాధా 2004లో గెలిచిన విజయవాడ తూర్పు ఎన్నికల గణాంకం ఒక రాజకీయ సత్యాన్ని చెబుతుంది. అదే నియోజకవర్గంలో తర్వాతి ఎన్నికల్లో ఆయనకు అదే స్థాయి విజయం రిపీట్ కాలేదు. అంటే ఒకసారి వచ్చిన కుటుంబ ప్రభావం శాశ్వత ఎన్నికల ఆస్తి కాదన్నమాట.

## వారసత్వం వేరు.. రాజకీయ దారులు వేరు

ప్రజలతో నిరంతర సంబంధం, స్థానిక సమస్యలపై పోరాటం, సంస్థాగత బలం, పార్టీ యంత్రాంగం, సామాజిక సమీకరణం...ఇవన్నీ కలిసినప్పుడే రాజకీయ వారసత్వం ఓటుగా మారుతుంది. ఆశా కిరణ్ ముందున్న పరీక్ష కూడా ఇదే. రంగా కుమార్తెగా పరిచయం కావడం తొలి తలుపు తెరవవచ్చు. కానీ ఆ తలుపు దాటి ప్రజల్లో స్థిరపడటానికి ఆమెకు స్వంత రాజకీయ కార్యక్రమం అవసరం. అదే విధంగా రాధా కూడా రంగా కుమారుడిగా ఉన్న గుర్తింపును మించి, తనకు తానుగా రాజకీయ పాత్రను మరింత స్పష్టంగా నిర్వచించుకోవాల్సి ఉంటుంది. ఒకరికి ఇప్పటికే ఉన్న గుర్తింపును నిలబెట్టుకోవాల్సిన బాధ్యత ఉంటే.. మరొకరికి కొత్త గుర్తింపును నిర్మించుకోవాల్సిన అవసరం ఉంది. అందుకే ఇప్పుడు వంగవీటి కుటుంబంలో అసలు పోటీ అన్నాచెల్లెళ్ల మధ్యనే అని చెప్పడం కంటే, రెండు తరాల రాజకీయ ఆలోచనల మధ్య తేడా ఉందని చెప్పడం సరైనది. రాధా రాజకీయాలు పార్టీ కేంద్రంగా సాగాయి. కాంగ్రెస్ నుంచి ప్రజారాజ్యం, వైసీపీ, టీడీపీ వరకు ఆయన ప్రయాణం సాగింది. ఆశా కిరణ్ మాత్రం ప్రజాజీవితం నుంచి రాజకీయ పార్టీ వైపు వెళ్లే మార్గాన్ని ఎంచుకుంటున్నట్లు ఇప్పటివరకు కనిపిస్తోంది. ఆమె ముందుగా రంగా అభిమాన సంఘాలను, సామాజిక వర్గాలను, మహిళలను, యువతను, స్థానిక ప్రజలను ఏ స్థాయిలో కలుపుకోగలుగుతారన్నది ముఖ్యం. ఒకవేళ ఆమె పార్టీ రాజకీయాల్లోకి వస్తే, ఆ పార్టీకి ఆమె కేవలం ఒక వారసురాలు కాదు...విజయవాడలో కొత్త సామాజిక సమీకరణానికి ప్రతీకగా నిలవాల్సి ఉంటుంది. అదే సమయంలో రాధాకు కూడా ఇప్పుడు ఒక కీలక అవకాశం ఉంది. అధికార కూటమిలో ఉన్న సమయంలో పార్టీ తనకు ఇచ్చే పాత్రను ప్రజల్లోకి తీసుకెళ్లగలిగితే, గత ఎన్నికల పరాజయాల కంటే ప్రస్తుత రాజకీయ పనితీరే ఆయన భవిష్యత్తును నిర్ణయించే అవకాశం ఉంటుంది. పదవి వస్తుందా లేదా అన్నది ఒక అంశం. పదవి లేకపోయినా రాజకీయంగా తనకు ఎంత స్థలం ఉందో నిరూపించుకోవడం మరో అంశం. రాజకీయాల్లో రెండోది మొదటిదానికంటే ఎక్కువ కాలం నిలుస్తుంది.

## రంగా గతం.. రాధా వర్తమానం.. ఆశా భవిష్యత్తు

చివరికి ప్రశ్న ఒక్కటే...వంగవీటి రంగా వారసత్వం ఎవరిది? చట్టపరంగా వారసత్వం కుటుంబానిదే కావచ్చు. భావోద్వేగంగా అభిమానులదే కావచ్చు. రాజకీయంగా మాత్రం అది ప్రజల తీర్పుతోనే పునర్నిర్వచించబడుతుంది. రాధా ఇప్పటికే ఆ పరీక్షను ఎదుర్కొన్నారు. ఒకసారి ఎమ్మెల్యేగా గెలిచారు. తర్వాత వరుసగా ఓటములు ఎదుర్కొన్నారు. పలు రాజకీయ వేదికలను చూశారు. ఇప్పుడు అధికార కూటమిలో ఉన్నారు. ఎమ్మెల్సీ పదవిపై ఆయన అనుచరులు ఆశలు పెట్టుకున్నా, అధికారిక నిర్ణయం వచ్చే వరకు అది రాజకీయ చర్చగానే ఉంటుంది. ఆశా కిరణ్ మాత్రం కొత్త పరీక్షకు సిద్ధమవుతున్నారు. 2025 నవంబర్‌లో ప్రజాజీవితంలోకి వస్తున్నట్లు ప్రకటించిన ఆమె, 2026లో ప్రజా కార్యక్రమాల్లో కనిపిస్తున్నారు. రంగా పేరు ఆమెకు రాజకీయ ప్రవేశ ద్వారం కావచ్చు. కానీ ఆ తర్వాతి దారి ఆమె స్వంత రాజకీయ నిర్మాణమే నిర్ణయిస్తుంది. రాధాకు తండ్రి నీడ నుంచి బయటికి వచ్చి తన రాజకీయ భవిష్యత్తును స్థిరపరచుకోవాల్సిన అవసరం ఉంటే.. ఆశా కిరణ్ తండ్రి వారసత్వాన్ని నేటి తరానికి అనువదించి కొత్త రాజకీయ భాషను సృష్టించుకోవాల్సిన అవసరం ఉంది. బెజవాడలో రంగా పేరు ఇంకా రాజకీయంగా పలుకుబడి కలిగిన పేరు కావచ్చు. కానీ ఆ పేరుతో రేపటి రాజకీయాన్ని గెలవాలంటే నిన్నటి జ్ఞాపకం సరిపోదు. నేటి ప్రజలతో బంధం కావాలి. రేపటి తరానికి నమ్మకం కల్పించాలి. చివరికి వంగవీటి కుటుంబ రాజకీయ కథలో రంగా గతం కావచ్చు.. రాధా వర్తమానం కావచ్చు.. ఆశా కిరణ్ భవిష్యత్తు కావచ్చు. కానీ ఆ భవిష్యత్తు ఎవరిదో నిర్ణయించేది కుటుంబం కాదు...బెజవాడ ప్రజలు మాత్రమే.. కాదంటారా..!



## గువాహటిలో భారత్‌కు ప్రపంచకప్ పరీక్ష

తిరువనంతపురం తర్వాత భారత్, వెస్టిండీస్ రెండో వన్డేకు గువాహటి సిద్ధమైంది. తొలి మ్యాచ్‌లో గెలిచిన భారత్ సిరీస్‌ను కైవసం చేసుకోవాలని చూస్తుండగా, వెస్టిండీస్ తిరిగి పోటీలో నిలవాలని పట్టుదలగా ఉంది. 2027 ప్రపంచకప్ కోసం అత్యుత్తమ 15 మందిని ఖరారు చేసుకునే దిశగా భారత్ ప్రయోగాలు కొనసాగిస్తోంది. నితీశ్ కుమార్ రెడ్డి, రవీంద్ర జడేజా, నామన్ ధీర్‌తో కూడిన ముగ్గురు ఆల్‌రౌండర్ల కాంబినేషన్ కొనసాగించే అవకాశముంది. బర్సాపరా స్టేడియంలో గత రెండు వన్డేలు భారీ స్కోర్లతో సాగాయి. కుల్దీప్ యాదవ్ 200 వన్డే వికెట్ల మైలురాయికి రెండు వికెట్ల దూరంలో ఉన్నాడు. భారత్ చివరి 12 వన్డేల్లో వెస్టిండీస్‌పై 11 విజయాలు సాధించింది.



## కోహ్లీ రికార్డుల వేట.. గవాస్కర్‌తో సమం

తిరువనంతపురం వేదికగా వెస్టిండీస్‌తో తొలి వన్డేలో విరాట్ కోహ్లీ మరోసారి రికార్డుల పుస్తకాలను తిరగరాశాడు. 88 బంతుల్లో 10 ఫోర్లు, 9 సిక్సర్లతో అజేయంగా 139 పరుగులు చేసి భారత్‌కు ఘన విజయాన్ని అందించాడు. ఈ శతకంతో కోహ్లీ వన్డేల్లో 55వ సెంచరీ పూర్తి చేసుకున్నాడు. వెస్టిండీస్‌పై అత్యధిక సెంచరీల విషయంలో సునీల్ గవాస్కర్ రికార్డును సమం చేశాడు. గవాస్కర్ 38 మ్యాచ్‌ల్లో 13 శతకాలు సాధించగా, కోహ్లీ 74 మ్యాచ్‌ల్లో ఈ ఘనత అందుకున్నాడు. వన్డేల్లో 15 వేల పరుగుల మైలురాయిని అత్యంత వేగంగా చేరిన బ్యాటర్‌గా సచిన్ టెండూల్కర్‌ను అధిగమించాడు. భారత గడ్డపై వన్డేల్లో 7,006 పరుగులతో సచిన్ 6,976 పరుగుల రికార్డును కూడా దాటాడు.















# ఆసియా క్రీడల్లో భారత్ గోల్డ్ జోష్

### 10వ రోజు 52 పతకాల మైలురాయి

ఆసియా క్రీడలు-2026లో భారత్ పదో రోజు పతకాల పంట పండించింది. షూటింగ్‌లో నీరు ధండా వ్యక్తిగత ట్రాప్ విభాగంలో స్వర్ణం సాధించి చరిత్ర సృష్టించగా, మహిళల రిలే జట్టు కూడా అథ్లెటిక్స్‌లో భారత్‌కు స్వర్ణాన్ని అందించింది. గుల్వీర్ సింగ్ 5000 మీటర్ల పరుగులో కాంస్యంతో ఈ క్రీడల్లో మూడో పతకాన్ని ఖాతాలో వేసుకున్నారు. బాక్సింగ్‌లో పర్వీన్ హుడా, అంకుష్ పంఘల్ ఫైనల్‌కు చేరి రజతాలను ఖాయం చేశారు. నరేందర్ బెర్వాల్ కాంస్య పతకం సాధించారు. ఆర్చరీ, స్క్వాష్, టెన్నిస్, కానో స్లాలోమ్‌లోనూ భారత క్రీడాకారులు కీలక విజయాలు నమోదు చేశారు. దీంతో భారత్ మొత్తం పతకాల సంఖ్య 52కు చేరింది. ఇందులో 6 స్వర్ణాలు, 21 రజతాలు, 25 కాంస్యాలు ఉన్నాయి.

**రిలే జట్టుకు చారిత్రక స్వర్ణం**

మహిళల రిలే జట్టు అథ్లెటిక్స్‌లో భారత్‌కు ఈ క్రీడల్లో తొలి స్వర్ణాన్ని అందించింది. షూటింగ్‌లో నీరు ధండా స్వర్ణం సాధించిన కొద్దిసేపటికే రిలే జట్టు కూడా అగ్రస్థానంలో నిలవడంతో భారత శిబిరంలో సంబరాలు వెల్లివిరిశాయి.

**షూటింగ్‌లో రజతం కూడా**

మహిళల టీమ్ ట్రాప్ షూటింగ్‌లో భారత్ రజత పతకం సాధించింది. వ్యక్తిగత ట్రాప్‌లో నీరు ధండా స్వర్ణం గెలిచారు. షపత్ భరద్వాజ్ పురుషుల వ్యక్తిగత ట్రాప్ ఫైనల్‌కు చేరినా పతకం సాధించలేకపోయారు. టీమ్ విభాగంలో మాత్రం భారత్‌కు మరో పతకం దక్కింది.

**గుల్వీర్‌కు మూడో పతకం**

అథ్లెటిక్స్‌లో గుల్వీర్ సింగ్ పురుషుల 5000 మీటర్ల పరుగులో కాంస్య పతకం సాధించారు. దీంతో ఈ ఆసియా క్రీడల్లో ఆయన ఖాతాలో మూడో పతకం చేరింది. వ్యక్తిగతంగా గుల్వీర్‌కు ఇది మరో కీలక విజయంగా నిలిచింది.

**బాక్సింగ్‌లో రెండు ఫైనల్స్**

బాక్సింగ్‌లో భారత్‌కు రెండు పతకాలు ఖరారయ్యాయి. మహిళల 65 కిలోల విభాగంలో పర్వీన్ హుడా ఫైనల్‌కు చేరి కనీసం రజతాన్ని ఖాయం చేశారు. పురుషుల 80 కిలోల విభాగంలో అంకుష్ పంఘల్ కూడా ఫైనల్‌కు దూసుకెళ్లి కనీసం రజత పతకాన్ని ఖాయం చేశారు.

**నరేందర్‌కు కాంస్య పతకం**

పురుషుల 90 కిలోలకు పైబడిన విభాగంలో భారత బాక్సర్ నరేందర్ బెర్వాల్ సెమీఫైనల్లో ప్రపంచ ఛాంపియన్ ఐబెక్ ఒరాల్‌బేతో ఓడిపోయారు. దీంతో ఆయన కాంస్య పతకంతో సరిపెట్టుకున్నారు.

**ఆర్చరీలో భారత ఆర్చర్ల దూకుడు**

పురుషుల రికర్వ్ వ్యక్తిగత విభాగంలో ధీరజ్ బొమ్మదేవర అద్భుత ప్రదర్శన చేశారు. ఫిలిప్పీన్స్‌కు చెందిన గిర్విన్ గార్సియాపై 6-0తో విజయం సాధించారు. అనంతరం చైనీస్ తైపీకి చెందిన చెంగ్ హ్సియాంగ్‌హుయ్‌పై 6-2తో గెలిచి తదుపరి దశకు చేరుకున్నారు. మరోవైపు నీరజ్ చౌహాన్ ఇండోనేషియాకు చెందిన రియావు ఎగా అగాటాపై 6-4తో గెలిచారు. దక్షిణ కొరియా స్టార్ కిమ్ జేడియోక్‌ను కూడా 6-4తో ఓడించి రౌండ్ ఆఫ్ 16లో విజయం సాధించారు.

**స్క్వాష్‌లో భారత్ విజయం**

మహిళల టీమ్ స్క్వాష్ పూల్‌సి పోరులో భారత్ 2-0తో ఇరాన్‌ను ఓడించింది. తాన్వీ ఖన్నా, అనాహత్ సింగ్ కీలక విజయాలతో భారత జట్టును ముందుకు నడిపించారు.

**టెన్నిస్‌లో వరుస విజయాలు**

పురుషుల సింగిల్స్‌లో దక్షిణ కొరియాకు చెందిన సియోంగ్‌చాన్ హాంగ్‌పై సుమిత్ నగాల్ 6-4, 6-0తో విజయం సాధించారు. మరో మ్యాచ్‌లో దక్షిణేశ్వర్ సురేశ్ గునావన్ ట్రిస్మువంతరాపై 7-5, 7-6తో గెలిచి తదుపరి రౌండ్‌కు చేరుకున్నారు.

**సైక్లింగ్‌లో తదుపరి పోరాటాలకు సిద్ధం**

పురుషుల టీమ్ స్ప్రింట్ క్వాలిఫికేషన్‌లో రొజిత్ సింగ్, డేవిడ్ బెక్‌హామ్, రొనాల్డ్ సింగ్ 44.895 సెకన్లతో ఏడో స్థానంలో నిలిచారు. తొలి రౌండ్‌లో చైనాతో తలపడనున్నారు. మహిళల టీమ్ స్ప్రింట్‌లో సెలెస్టినా, సరితా కుమారి, కీర్తి రంగస్వామి చిక్కా ఆరో స్థానంలో నిలిచారు. మహిళల టీమ్ పర్స్యూట్‌లో హర్షితా ఝాకర్, పూజా దనోలే, మీనాక్షి, స్వస్తి సింగ్ ఐదో స్థానంలో నిలిచి తదుపరి దశకు అర్హత సాధించారు.

**కానో స్లాలోమ్‌లో సెమీస్ బెర్తులు**

కానో స్లాలోమ్‌లో భారత క్రీడాకారులు సెమీఫైనల్స్‌కు చేరారు. మహిళల కయాక్ సింగిల్స్‌లో శిఖా చౌహాన్ 11వ స్థానంలో నిలిచారు. పురుషుల కయాక్ సింగిల్స్‌లో హితేశ్ కేవత్ ఎనిమిదో, ప్రద్యుమ్న సింగ్ రాథోడ్ పదో స్థానంలో నిలిచారు. మహిళల కానో సింగిల్స్‌లో పల్లవి జగ్తాప్ ఏడో, రినా సేన్ తొమ్మిదో స్థానంలో నిలిచి సెమీస్‌కు చేరుకున్నారు.

**సర్ఫింగ్‌లో పోరాటం ముగిసింది**

పురుషుల షార్ట్‌బోర్డ్ క్వార్టర్‌ఫైనల్లో భారత సర్ఫర్ కిషోర్ కుమార్ అన్బరసు 5.37 పాయింట్లు సాధించారు. ఫిలిప్పీన్స్ ఆటగాడు టోబీ ఎస్పెజాన్ 8.53 పాయింట్లతో విజయం సాధించడంతో కిషోర్ పోటీ నుంచి నిష్క్రమించారు.

**కురాష్‌లో నిరాశ**

పురుషుల 66 కిలోల కురాష్ రౌండ్ ఆఫ్ 16లో భారత ఆటగాడు విపిన్ కుమార్ దక్షిణ కొరియాకు చెందిన హాన్ హ్యోన్‌సూతో 0-3తో ఓడిపోయారు. దీంతో ఆయన పోరాటం ముగిసింది.

**చివరి దశపై భారత్ దృష్టి**

10వ రోజు ముగిసే సమయానికి భారత్ 6 స్వర్ణాలు, 21 రజతాలు, 25 కాంస్యాలతో మొత్తం 52 పతకాలు సాధించింది. పతకాల పట్టికలో భారత్ 10వ స్థానంలో నిలిచింది. ఆసియా క్రీడల చివరి దశలో ఆర్చరీ, రెజ్లింగ్, బాక్సింగ్ విభాగాల్లో భారత క్రీడాకారుల నుంచి మరిన్ని పతకాలపై ఆశలు కొనసాగుతున్నాయి.

# ఎన్టీఆర్-త్రివిక్రమ్ జోడీ..!

## మురుగన్ కథతో మహా యుద్ధం



టాలీవుడ్‌లో మోస్ట్ అవైటెడ్ కాంబినేషన్ మరోసారి భారీ సంచలనానికి సిద్ధమవుతోంది! ‘అరవింద సమేత’ తర్వాత యంగ్ టైగర్ ఎన్టీఆర్, మాటల మాంత్రికుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ కలిసి చేస్తున్న ప్రతిష్ఠాత్మక ప్రాజెక్ట్‌పై తాజాగా అదిరిపోయే అప్‌డేట్ బయటకు వచ్చింది. పురాణ, పౌరాణిక అంశాల మేళవింపుతో.. శ్రీ మురుగన్ నేపథ్యంగా తెరకెక్కనున్న ఈ సినిమా కథ పూర్తిగా సిద్ధమైందని త్రివిక్రమ్ స్వయంగా వెల్లడించారు. ‘ఆదర్శ కుటుంబం’ ప్రమోషన్స్‌లో సుమతో జరిగిన ప్రత్యేక ఇంటర్వ్యూలో మాట్లాడిన ఆయన.. స్క్రిప్ట్ రెడీగా ఉన్నా, సినిమాకు తుది టైటిల్ ఇంకా ఖరారు కాలేదని స్పష్టం చేశారు. కొంతకాలంగా ప్రచారంలో ఉన్న ‘గాడ్ ఆఫ్ వార్’ టైటిల్‌పై మాత్రం అధికారిక ప్రకటన రాలేదు. ఎన్టీఆర్ ఇమేజ్, త్రివిక్రమ్ విజన్ కలిస్తే తెరపై ఎలాంటి అద్భుతం ఆవిష్కృతమవుతుందో అన్న ఆసక్తి అభిమానుల్లో ఇప్పటికే పీక్స్‌కు చేరింది. 2027లో ఈ భారీ చిత్రం సెట్స్‌పైకి వెళ్లనుంది. హారిక అండ్ హాసిని క్రియేషన్స్, ఎన్టీఆర్ ఆర్ట్స్ బ్యానర్లపై ఎస్. రాధాకృష్ణ, కళ్యాణ్‌రామ్ సంయుక్తంగా నిర్మించనున్నారు. అనిరుధ్ సంగీతం అందించనున్న ఈ ప్రాజెక్ట్.. పౌరాణిక వైభవం, ఎన్టీఆర్ మాస్ ఇమేజ్, త్రివిక్రమ్ కథనశైలితో సినీ ప్రేక్షకులకు భారీ విజువల్ ట్రీట్ ఇచ్చేందుకు సిద్ధమవుతోంది!



## తేజ సజ్జా చేతుల్లో ట్రైటర్స్

తెలుగు ఓటీటీ వినోదంలో మరో సరికొత్త సెన్సేషన్‌కు రంగం సిద్ధమైంది! యంగ్ హీరో తేజ సజ్జా ఇప్పుడు హీరోగా మాత్రమే కాదు.. అదిరిపోయే గేమ్‌మాస్టర్‌గా ప్రేక్షకులను పలకరించబోతున్నాడు. ప్రైమ్ వీడియో అధికారికంగా ప్రకటించిన ‘ది ట్రైటర్స్ తెలుగు’లో తేజ సజ్జా హోస్ట్‌గా కనిపించనున్నాడు. అక్టోబర్ 15, 2026 నుంచి స్ట్రీమింగ్ కానున్న ఈ ఇంటర్నేషనల్ ఫార్మాట్ ఇప్పటికే హిందీలో రెండు సీజన్లతో భారీ ఆదరణ సొంతం చేసుకోగా.. ఇప్పుడు తెలుగు ప్రేక్షకుల కోసం మరింత ఉత్కంఠభరితంగా ముస్తాబవుతోంది. ఎస్ఓఎల్ ప్రొడక్షన్స్ నిర్మిస్తున్న ఈ 10 ఎపిసోడ్ల షో నాలుగు వారాల పాటు ప్రతి గురువారం కొత్త ఎపిసోడ్‌తో సందడి చేయనుంది. 20 మంది విభిన్న నేపథ్యాల కంటెస్టెంట్లు.. నమ్మకం, స్నేహం, వ్యూహం, మోసం చుట్టూ సాగే హైఇంటెన్సిటీ గేమ్‌లో తలపడనున్నారు. ‘ఇన్నోసెంట్స్’లో దాగిన ‘ట్రైటర్స్’ను కనిపెట్టే ప్రయత్నం చేస్తుంటే.. అసలు ద్రోహులు తమ గుర్తింపును దాచుకుంటూ గేమ్‌ను తారుమారు చేయాలి. ఈ మైండ్‌గేమ్‌కు తేజ సజ్జా స్టైలిష్ లుక్, చురుకైన హోస్టింగ్, సహజమైన చలాకీతనం మరింత కిక్ ఇవ్వబోతున్నాయి. తెలుగు రాష్ట్రాలతో పాటు విదేశాల్లోని ప్రేక్షకులను సైతం ఆకట్టుకునేలా ఈ షోను రూపొందించినట్లు ప్రైమ్ వీడియో, ఎస్ఓఎల్ ప్రొడక్షన్స్ ప్రతినిధులు తెలిపారు. మొత్తానికి.. తేజ సజ్జా గేమ్‌మాస్టర్‌గా మారితే.. ‘ట్రైటర్స్ తెలుగు’లో అసలు ట్విస్ట్‌లు ఎక్కడ మొదలవుతాయో చూడాల్సిందే!

# ఫహాద్ ఫాసిల్ స్టార్‌డమ్

## అప్పుడే చెప్పిన విజయ్



12 ఏళ్ల వయసులో విన్న ఆ మాట.. ఏళ్ల తర్వాత నిజమైంది! మలయాళ స్టార్ ఫహాద్ ఫాసిల్ నటుడిగా ఎదిగిన కథలో తమిళ స్టార్ విజయ్‌తో ఉన్న అనుబంధం ఇప్పుడు సినీ అభిమానుల్లో ఆసక్తి రేపుతోంది. దర్శకుడు ఫాజిల్ తెరకెక్కించిన ‘కాదలుక్కు మరియాదై’ షూటింగ్ సమయంలో తొలిసారి విజయ్‌ను కలిసిన విషయాన్ని ఫహాద్ తాజాగా గుర్తుచేసుకున్నాడు. అప్పటికి తన వయసు 12 లేదా 13 ఏళ్లు మాత్రమేనని చెప్పిన ఫహాద్.. “నువ్వు నటుడవుతావా?” అని అడిగిన తొలి వ్యక్తి విజయ్ అని వెల్లడించాడు. సినిమాల గురించి మాత్రమే మాట్లాడుకునే ఆ రోజుల్లో విజయ్ తనతో ‘ఖుషి’ సినిమా ఆలోచనను కూడా పంచుకున్నాడని తెలిపాడు. అయితే విజయ్ రాజకీయాల్లోకి వచ్చి తమిళనాడు ముఖ్యమంత్రి అవుతారని మాత్రం అప్పట్లో ఊహించలేదని ఫహాద్ చెప్పాడు. మరోవైపు తండ్రి ఫాజిల్ దర్శకత్వంలో ‘కైయెతుం దూరత్’తో హీరోగా అడుగుపెట్టిన ఫహాద్‌కు చేదు పరాజయం ఎదురైంది. ఆ వైఫల్యాన్ని మనసుకు తీసుకున్న ఆయన కొంతకాలం అమెరికా వెళ్లి చదువుకున్నాడు. ఇంజినీరింగ్ అనుకున్నా ఫిలాసఫీ చదివిన ఫహాద్‌కు అక్కడి స్నేహితుల ద్వారా ప్రపంచ సినిమాలపై ఆసక్తి పెరిగింది. తిరిగొచ్చి తండ్రితో మరో సినిమా చేయాలని నిర్ణయించుకున్న ఆయన.. నేడు అగ్ర నటుడిగా నిలిచాడు. ఇప్పుడు ‘డోంట్ ట్రబుల్ ది ట్రబుల్’తో తొలిసారి తెలుగు హీరోగా ప్రేక్షకుల ముందుకు రాబోతున్న ఫహాద్.. ఎస్ఎస్ రాజమౌళి సమర్పణలో అక్టోబర్ 2న థియేటర్లలో సందడి చేయనున్నాడు. ‘విక్రమ్’, ‘ఆవేశం’ సీక్వెల్స్‌తోనూ అభిమానులను మరింత అలరించేందుకు సిద్ధమవుతున్నాడు.






## కశ్మీర్ అందాల్లో ప్రేమ మాయ

### రోషన్-ప్రీతి కెమిస్ట్రీ అదుర్స్!

ప్రేమకు కశ్మీర్ అందాలు తోడైతే.. ఆ ఫీల్ ఎలా ఉంటుందో చూపిస్తోంది ‘ఏమో ఏమో ఇది’ టైటిల్ సాంగ్! డాక్టర్ శైలేష్ కొలను దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ రొమాంటిక్ ఎంటర్‌టైనర్ టైటిల్ టీజర్‌తో ఇప్పటికే ఆకట్టుకోగా.. ఇప్పుడు ఫుల్ సాంగ్‌తో మ్యూజికల్ ప్రమోషన్స్‌కు మరింత జోష్ తీసుకొచ్చింది. హేషమ్ అబ్దుల్ వహాబ్ స్వరపరిచిన ఈ పాటలో రోషన్ మేకా, ప్రీతి ముఖుందన్ జంట ప్రేక్షకులను కట్టిపడేస్తోంది. ఇద్దరి మధ్య కనిపించే సహజమైన కెమిస్ట్రీ.. పాటకు అసలైన హైలైట్‌గా నిలుస్తోంది. రోషన్ స్టైలిష్ లుక్, చార్మింగ్ స్క్రీన్ ప్రెజెన్స్ ఒకవైపు ఆకట్టుకుంటే.. ప్రీతి అందమైన ఎక్స్‌ప్రెషన్స్ మరోవైపు పాటకు ప్రత్యేక గ్లామర్ తీసుకొచ్చాయి. మంచుతో కప్పుకున్న పర్వతాలు, ప్రకృతి అందాలు, డ్రీమీ విజువల్స్‌తో కశ్మీర్ లొకేషన్స్ పాటను మరింత రొమాంటిక్‌గా మార్చేశాయి. కార్తీక్, రమ్య బెహరా ఆలపించిన ఈ పాటకు కృష్ణకాంత్ సాహిత్యం అందించారు. సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ నిర్మిస్తున్న ఈ చిత్రాన్ని శ్రీకర స్టూడియోస్ సమర్పిస్తోంది. వంశీ పచ్చిపులుసు సినిమాటోగ్రఫీ అందిస్తున్నారు. అక్టోబర్ **30, 2026**న థియేటర్లలోకి రాబోతున్న ‘ఏమో ఏమో ఇది’.. ప్రేమికుల హృదయాల్లో కొత్త ఫీల్ నింపేందుకు సిద్ధమవుతోంది!

This newspaper is Owned and Published by **GUNDEBOINA VENKANNA** from 2-7-76, GURUKRUPA COMPLEX, UPPAL, MEDCHAL MALKAJGIRI, TELANGANA - 500047. Phone Number: 9440906108.
Editor: **GUNDEBOINA VENKANNA** and Printed at 1-5-431/20/4, JONNABANDA, OLD ALWAL, MEDCHAL MALKAJGIRI, TELANGANA - 500010.
PRGI REGD No.: **TGBIL/26/A6717**. www.rajyasamskarana.com.